

జోడు రమేష్ కుమార్
చీఫ్ బ్యూరో
+91 99592 92159

KADILIMCHE VAARTHA Telugu daily
# కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

NATIONAL NEWS CHANNEL

సంపుటి : 06 సంచిక : 18 పేజీలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం - 02 - జూలై- 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar.

## వారి కళ్లలో ఆనందమే మా సంతోషం



- త్వరలోనే రైతులకు రూ.20 వేలు అందిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.
- ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకానుందన్నారు.
- తామిచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు.

## యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చి
# కుటుంబ పెద్దగా ఉంటా: సీఎం చంద్రబాబు

- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా వెళ్తున్నామని నెలకు రూ.2,750 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నట్లు వివరించారు.
- ప్రతినెలా ఒకటో తేదీన గ్రామాలు కళకళలాడేందుకు పింఛన్లే ప్రధాన కారణమని సీఎం
- 15 నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కూడా అమలు చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.
- పేదలకు పింఛన్లు సేవాభావంతో అందజేయడం ముఖ్యమని అలానే పేదలను చులకనగా చూస్తే వదిలిపెట్టనని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.




మిగతాది 2లో

మలకపల్లిలో పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని వెల్లడి

అమరావతి : రాష్ట్రంలో సమర్థ నాయకత్వం అందించేవాళ్లెవరో ఆలోచించాలేగానీ, కులం మతం చూసి ఓట్లేస్తారా అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా మలకపల్లిలో పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. అనంతరం పీ4 సభలో పాల్గొన్నారు. మార్గదర్శి-బంగారు కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వేదికపై సీఎం డప్పు కొట్టారు. అనర్హుల పింఛన్లు తొలగిస్తుంటే రాజకీయాలు చేస్తున్నారన్న సీఎం త్వరలోనే నిరుద్యోగ భృతికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. అభివృద్ధి పథంలో రాష్ట్రం: ప్రతినెలా ఒకటో తేదీన గ్రామాలు కళకళలాడేందుకు పింఛన్లే ప్రధాన కారణమని సీఎం అన్నారు. పేదలను ఆదుకునేందుకు 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పింఛన్లు

## ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత



- గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన నారా లోకేశ్
- పట్టాభిరామ్ మరణం పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం

అమరావతి : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీవీ పట్టాభిరామ్ కన్నుమూశారు. మిగతా..2లో

# పాశమైలారం ఘోర ప్రమాదం...

సిగాచి ప్రమాదంపై హెచ్‌ఆర్‌సీ సుమోటో

జులై 30లోగా నివేదికకు ఆదేశం

పాశమైలారం ఘటనపై ఫిర్యాదుల వెల్లువ



అమరావతి : సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటన తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ దుర్ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా కేసు నమోదు చేయగా, మరోవైపు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సైతం ఫిర్యాదులు అందాయి. మిగతా..2లో

# వల్లభనేని వంశీకి భారీ ఊరట...

వంశీకి నకిలీ పట్టాల కేసులో బెయిల్

మొత్తం 10 కేసుల్లోనూ బెయిల్ రావడంతో విడుదలయ్యే అవకాశం

షరతులతో బెయిల్ ఇచ్చిన నూజివీడు కోర్టు

వంశీ బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్


ప్రభుత్వ పిటిషన్‌పై రేపు విచారణ జరపనున్న సర్వోన్నత న్యాయస్థానం



అమరావతి : వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఒకేరోజు ఊరట, ఉత్కంఠ ఎదురయ్యాయి. తనపై నమోదైన అన్ని కేసుల్లోనూ బెయిల్ లభించడంతో ఆయన విడుదలకు మార్గం సుగమమైందని భావిస్తున్న తరుణంలోనే, ఆయన బెయిల్‌ను రద్దు చేయాలంటూ మిగతా..2లో

## రూ.3 లక్షల కోట్లతో పలు కీలక పథకాలకు
# కేంద్ర క్యాబినెట్ ఆమోదం

- మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- రూ.1.07 లక్షల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తారు.
- ఇది మ్యాన్యుఫ్యాక్చరింగ్-డ్రైవెన్ ఎకానమీకి కీలక గ్రోత్ ఇంజన్ అని గత బడ్జెట్‌లో వైష్ణవ్ ప్రకటించారు.



న్యూఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ మంగళవారంనాడు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.3 లక్షల కోట్లకు పైగా విలువచేసే పలు కీలక పథకాలకు ఆమోదం తెలిపింది. వీటిలో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ పరిశోదన-అభివృద్ధి-ఆవిష్కరణ జాతీయ క్రీడావిధానం 2025, తమిళనాడులో కీలక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టు ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మిగతా..2లో

# బీఆర్ఎస్ పునరుజ్జీవనం కోసం తాపత్రయం

- నీళ్ల సెంటిమెంట్ బీఆర్ఎస్‌ను బతికిస్తుందని ఆ పార్టీ నేతలు అనుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.
- అందుకోసం పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబుతోపాటు తెలంగాణ ప్రభుత్వాన్ని భూతాలుగా చూపుతున్నారంటూ ఆ పార్టీ నేతలను విమర్శించారు.
- కేసీఆర్ అబద్దాలు చెప్పడం వల్లే అధికారాన్ని కోల్పోయారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.



హైదరాబాద్, జులై 01: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అబద్దాలు చెప్పడం వల్లే అధికారాన్ని కోల్పోయారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ డిపాజిట్లు సైతం కోల్పోయారని చెప్పారు. అనంతరం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులు సైతం దొరకలేదని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ పునరుజ్జీవనం కోసం ఆ పార్టీ నేతలు తాపత్రయ పడుతున్నారని ఎద్దేవా చేశారు. అందుకోసమే నీళ్ల సెంటిమెంట్‌ను వాడుకోవాలని చూస్తున్నారంటూ ఆ పార్టీ నేతలపై ఆయన మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆ నీళ్ల సెంటిమెంటే బీఆర్ఎస్ పార్టీని బతికిస్తుందని వాళ్లు అనుకుంటున్నారన్నారు. మిగతా..2లో

## ఏపీ, తెలంగాణ బీజేపీ కొత్త చీఫ్‌లకు సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్ విషెస్



ఏపీ, తెలంగాణలో బీజేపీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మాధవ్, రామచందర్ రావుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ అభినందనలు తెలియజేశారు.

అమరావతి, జులై 1: ఆంధ్రప్రదేశ్ బీజేపీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా..2లో

## బనకచర్లపై తమ వాదనతో
# ఏకీభవించిన కేంద్రం

- ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం
- బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై తెలంగాణలోని ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న వైఖరిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.
- ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై తమ వాదనతో కేంద్రం ఏకీభవించిందని తెలిపారు.



హైదరాబాద్, జులై 01: ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాలు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నాయని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ప్రజా భవన్‌లో బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. మిగతా..2లో

## కేసీఆర్ సంతకాలే మరణ శాసనం..
# తెలంగాణ జలాల విషయంలో వెనక్కి తగ్గేది లేదు

- ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల'పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్
- గత పదేళ్లలో కేసీఆర్, హరీశ్ రావులే రాష్ట్రానికి నష్టం చేశారని ఆరోపణ
- 2015 నాటి ఒప్పందమే తెలంగాణకు మరణశాసనంగా మారిందని తీవ్ర విమర్శ
- రాష్ట్ర నీటి హక్కుల కోసం రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని వెల్లడి
- ఏపీ ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటుంటే తెలంగాణ ప్రాజెక్టులు పట్టించుకోలేదని వ్యాఖ్య



వివరాలు 2లో..

హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు 2015లో చేసిన సంతకాలే తెలంగాణ నీటి హక్కులకు మరణశాసనంగా మారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర జలాల విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తే లేదని, తెలంగాణ హక్కుల సాధన కోసం రాజకీయంగా, సాంకేతికంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల' అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పదేళ్ల పాటు నీటిపారుదల శాఖను కేసీఆర్, హరీశ్ రావులే చూశారు.

# వల్లభనేని వంశీకి భారీ ఊరట...

రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. ఈ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం రేపు విచారణ చేపట్టనుండటంతో వంశీ భవితవ్యం ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. వివరాల్లోకి వెళితే, ఏలూరు జిల్లా నూజివీడు కోర్టులో నమోదైన నకిలీ ఇళ్ల పట్టాల కేసుకు సంబంధించి ఈరోజు నూజివీడు కోర్టు వంశీకి బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని, వారానికి రెండుసార్లు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని న్యాయస్థానం షరతులు విధించింది. ఈ కేసుతో కలిపి తనపై నమోదైన మొత్తం 10 కేసుల్లోనూ వంశీకి బెయిల్ లభించినట్లయింది. దీంతో ఆయన జైలు నుంచి విడుదల కావడం ఖాయమని ఆయన వర్గీయులు భావించారు. అయితే, వంశీకి లభించిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై రేపు విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఒకవైపు కింది కోర్టుల్లో అన్ని కేసుల్లోనూ బెయిల్ లభించినప్పటికీ, మరోవైపు సుప్రీంకోర్టులో ప్రభుత్వ పిటిషన్ విచారణకు రానుండటంతో ఆయన విడుదల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రేపటి విచారణలో సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాలపైనే వంశీ విడుదల ఆధారపడి ఉంది. గత ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మైహోం భుజా అపార్ట్‌మెంట్‌లో వల్లభనేని వంశీని విజయవాడ పటమట పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కిడ్నాప్, దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఆరోపణలతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద ఆయనపై కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత ఆయనపై వరుసగా మరికొన్ని కేసులు నమోదయ్యాయి. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ, కోలుకున్న తర్వాత తిరిగి జైలుకే తరలించారు. అప్పటి నుంచి ఆయన బెయిల్ కోసం ప్రయత్నిస్తూ రాగా, తాజాగా అన్ని కేసుల్లోనూ ఊరట లభించింది. అయితే, సుప్రీంకోర్టులో ప్రభుత్వ పిటిషన్ రూపంలో మరో న్యాయపోరాటం ఆయన ముందు నిలిచింది.

# పాశమైలారం ఘోర ప్రమాదం...

బాధితులకు న్యాయం చేయాలని, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రమాద ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, దీనిని సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, జులై 30వ తేదీలోగా నివేదిక సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీ, జిల్లా ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఈ ఘటనపై రామారావు అనే వ్యక్తి జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. సిగాచి పరిశ్రమ డైరెక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షలు, గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం ఇప్పించాలని ఆయన కమిషన్‌ను కోరారు. దీంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా తెలంగాణలోని అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే ఘటనపై న్యాయవాది కుమారస్వామి సైతం రాష్ట్ర హెచ్ఆర్‌సీకి మరో ఫిర్యాదు చేశారు. పరిశ్రమలో పాత యంత్రాలను వినియోగించడం, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడమే ప్రమాదానికి ప్రధాన కారణాలని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిగాచి కెమికల్ పరిశ్రమ యాజమాన్యంపైనా, సంబంధిత అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఫ్యాక్టరీలకు ముందుజాగ్రత్త చర్యలపై ఆదేశాలు ఇవ్వాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వరుస ఫిర్యాదులు, హెచ్ఆర్‌సీ స్పందనతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## కేసీఆర్ సంతకాలే మరణ శాసనం..

# తెలంగాణ జలాల విషయంలో వెనక్కి తగ్గేది లేదు

వారే రాష్ట్ర నీటి హక్కులను కాపాడతారని ప్రజలంతా భావించారు. కానీ దురదృష్టవశాత్తు వారి నిర్ణయాల వల్లే తెలంగాణకు తీరని నష్టం జరిగింది" అని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో మొత్తం 811 టీఎంసీలకు గాను తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని, మిగిలిన 68 శాతం నీటిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 2015లో వారే సంతకాలు చేశారని రేవంత్ ఆరోపించారు.కృష్ణా నది పరివాహక ప్రాంతం ప్రకారం చూస్తే వాస్తవానికి తెలంగాణకే ఎక్కువ నీటి వాటా దక్కాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ప్రాజెక్టులను గత పదేళ్లలో పట్టించుకోకపోవడం వల్లే రాష్ట్రానికి కేటాయించిన 299 టీఎంసీల నీటిని కూడా పూర్తిగా వాడుకోలేని దయనీయ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం తమ ప్రాజెక్టులను పూర్తిచేసుకొని నీటిని తరలించుకుపోతోందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, నీటి హక్కుల పరిరక్షణలో వెనకడుగు వేసేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

## ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు

# బీవీ పట్టాభిరామ్ కన్నుమూత

గుండెపోటుతో ఆసుపత్రిలో చేరిన ఆయన, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మెజీషియన్, హిప్నాటిస్టు, రచయిత, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా ఆయన తెలుగు ప్రజలకు సుపరిచితులు. ఆయన మరణ వార్తతో వ్యక్తిత్వ వికాస రంగంలో విషాదం నెలకొంది. పట్టాభిరామ్ మరణం పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళు లర్పించారు. "ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, మెజీషియన్ బీవీ పట్టాభిరామ్ గారి మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మెజీషియన్‌గా, హిప్నాటిస్టుగా, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా బీవీ పట్టాభిరామ్ ఎనలేని సేవలు అందించారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. పట్టాభిరామ్ కేవలం వ్యక్తిత్వ వికాస నిపుణుడిగానే కాకుండా రచయితగానూ విశేష కీర్తిని గడించారు. తెలుగుతో పాటు ఇంగ్లిష్, కన్నడ, తమిళ భాషల్లోనూ ఆయన అనేక పుస్తకాలు రచించారు. ఒత్తిడిని జయించడం, ఆత్మవిశ్వాసం, మానవ సంబంధాలు వంటి అంశాలపై భారత్‌తో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి పలు దేశాల్లో వేలాది వర్క్‌షాపులు నిర్వహించి లక్షలాది మందిలో స్ఫూర్తి నింపారు. హిప్నోసిస్‌పై ఆయన చేసిన కృషికి గాను ఫ్లోరిడా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన ఆయన, సైకాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే), రాష్ట్ర పోలీసు అకాడమీ, షార్ శ్రీహరికోట, డీఆర్‌డీఎల్, భారత్ డైనమిక్స్, ఎన్ఐఆర్‌డీ సహా అనేక ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఆయన గౌరవ సలహాదారుగా సేవలు అందించారు. ఆయన మృతి వ్యక్తిత్వ వికాస రంగానికి తీరని లోటని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## రూ.3 లక్షల కోట్లతో పలు కీలక పథకాలకు

# కేంద్ర క్యాబినెట్ ఆమోదం



### రూ.లక్ష కోట్లతో..

పరిశోధానాభివృద్ధి, ఆవిష్కరణ రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా రీసెర్చ్ డవలప్‌మెంట్ అండ్ ఇన్నొవేషన్ పథకానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి రూ.1 లక్ష కోట్లు కేటాయించింది. ఇజ్రాయెల్, యూఎస్, సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లో విజయవంతమైన గ్లోబల్ మోడల్స్‌ను అధ్యయనం చేసి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ రూపొందించిన అంతర్జాతీయ రోడ్‌మ్యాప్ ఆధారంగా ఈ స్కీమ్ ఉంటుంది. ప్రైవేటు రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందుకు దీన్ని డిజైన్ చేసినట్టు తెలిపింది. ఈ పథకం కింద ఆర్డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ, వడ్డీరహిత దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ అందించనున్నారు.

### ఈఎల్ఐ పథకానికి రూ.1.07 లక్షల కోట్లు

మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1.07 లక్షల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఇది మ్యాన్యుఫ్యాక్చరింగ్-డ్రైవెన్ ఎకానమీకి కీలక గ్రోత్ ఇంజన్ అని గత బడ్జెట్‌లో వైష్ణవ్ ప్రకటించారు.

### జాతీయ క్రీడా విధానానికి పచ్చజెండా

గత దశబ్దా కాలంలో భారతదేశం క్రీడారంగంలో సాధిస్తున్న వృద్ధిని దృష్టిలో ఉంచుకుని జాతీయ క్రీడా విధానం-2025కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతిభావంతులైన క్రీడాకారులను అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లడం, కోచింగ్ అవకాశాలు పెరుగుపరచడం, దేశంలోని క్రీడా సదుపాయాలను పటిష్టం చేయడం వంటికి ఈ పథకం ప్రధాన ఉద్దేశాలు.

### రూ.1,853 కోట్లతో నాలుగు లేన్ల నేషనల్ హైవే

దక్షిణ భారతదేశంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంలో భాగంగా తమిళనాడులోని పరమకుడి-రామనాథపురం సెక్షన్ల మధ్య నాలుగు లేన్ల నేషనల్ హైవే విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 46.7 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.1,853 కోట్లు వ్యయం చేయనుంది.

## యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చి

# కుటుంబ పెద్దగా ఉంటా: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి




### యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చి కుటుంబ పెద్దగా ఉంటా: సీఎం చంద్రబాబు

సరిగా ఇవ్వలేదని ఇంకా వ్యవస్థలన్నీ పడకేశాయని ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని అన్నట్లుగానే విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా వెళ్తున్నామని నెలకు రూ.2,750 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికామని సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం తెలిపారు.

### యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చి కుటుంబ పెద్దగా ఉంటా: సీఎం చంద్రబాబు

ప్రపంచస్థాయిలో పర్యాటకం: గోదావరి పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని సీఎం వెల్లడించారు. అలానే రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై త్వరలో సమావేశ నిర్వహిస్తామని పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామని అన్నారు. ఇంట్లో పెళ్లి చేయాలంటే 7 తరాలు చూస్తారని అలానే రాష్ట్రంలో నాయకుడు కావాలంటే గుడ్డిగా ఓటు వేయవద్దని సూచించారు. రాష్ట్రంలో జీరో పావర్టీ, మెరుగైన జీవన ప్రమాణాలుండాలని అన్నారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు ప్రస్తుతం 510 సేవలు అందిస్తున్నామని రాబోయే రోజుల్లో 100 శాతం సేవలు అందిస్తామని సీఎం వెల్లడించారు. పేదలను చులకనగా చూస్తే అంతే: తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు జమ చేస్తున్నామని ఇంక ఆగస్టు 15 నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కూడా అమలు చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. యోగాంధ్రలో 2 గిన్నిస్ రికార్డులు, 21 వరల్డ్ బుక్ రికార్డులు వచ్చాయని అన్నారు. పేదలకు పింఛన్లు సేవాభావంతో అందజేయడం ముఖ్యమని అలానే పేదలను చులకనగా చూస్తే వదిలిపెట్టనని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. రాజకీయ ముసుగులో ప్రజాధనం దుర్వినియోగం సబబు కాదని అన్నారు. ఇంక రాష్ట్రంలో ఎవరైనా డ్రగ్స్, గంజాయి అమ్మితే తాటతీస్తానని సీఎం హెచ్చరించారు. యువతకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం. మెగా డీఎస్సీ కింద 16,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి. కానీ కొంత మంది మెగా డీఎస్సీకి అనేక అడ్డంకులు సృష్టించారు. నెలలోగా ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. నిరుద్యోగ భృతి ఇచ్చి కుటుంబ పెద్దగా అండగా ఉంటాను. 2029 నాటికి పేదరికం లేని సమాజం చూడాలనేదే నా లక్ష్యం. పోలవరాన్ని పూర్తి చేసే బాధ్యత మళ్లీ దేవుడు నాకే ఇచ్చాడు. 2027 నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. డిసెంబర్ నాటికి పోలవరం డయాఫ్రమ్ వాల్ పూర్తవుతుంది.

# ఏపీ, తెలంగాణ బీజేపీ కొత్త చీఫ్‌లకు సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్ విషెస్

మొదటి పేజీ తరువాయి



పరస్పర సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడదామని ఎక్స్‌లో సీఎం పోస్టు చేశారు. అలాగే ఏపీ, తెలంగాణ కొత్త బీజేపీ చీఫ్‌లు మాధవ్, రామచందర్ రావులకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. తెలుగు జాతి అభ్యున్నతి కోసం ఇద్దరు నేతలు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

### చంద్రబాబు ట్వీట్

'ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. నూతన బాధ్యతల్లో మీరు రాణించాలని కోరుకుంటున్నాను. కూటమిలోని మూడు పార్టీల సమన్వయం, పరస్పర సహకారంతో రాష్ట్రాభివృద్ధికి పాటు పడదాం' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

### హృదయపూర్వక అభినందనలు: లోకేష్

'ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు, తెలంగాణా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్ రామచందర్ రావుకు నా హృదయపూర్వక అభినందనలు. శాసనమండలి సభ్యులుగా పని చేసిన ఇద్దరూ చట్టసభల్లో తమగళాన్ని బలంగా వినిపించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై పోరాడిన అనుభవం గల ఇద్దరు నేతలు తెలుగుజాతి అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్టు చేశారు.

### పవన్ అభినందనలు

అలాగే ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్, తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్ రామచందర్ రావుకు హృదయపూర్వక అభినందనలు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించిన ఆయన ఎమ్మెల్సీగా ప్రజా గళాన్ని శాసనమండలిలో వినిపించారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతారని, కేంద్ర ప్రభుత్వం జాతీయ దృక్పథంతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షిస్తున్నాను అని డిప్యూటీ సీఎం అన్నారు. అలాగే ఏపీ బీజేపీ చీఫ్‌గా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు కూడా మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు పవన్. విద్యార్థి దశ నుంచి రాజకీయాలలో ఉన్న మాధవ్.. శాసనమండలి సభ్యుడిగా పలు ప్రజా సమస్యలపై, యువత, నిరుద్యోగులకు సంబంధించిన అంశాలు చట్టసభల్లో ప్రస్తావించారన్నారు. జాతీయవాద దృక్పథం కలిగిన నాయకుడని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా మాధవ్ కూటమి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు. శాఖ సహాయ మంత్రి మాజిద్ తక్త్ రావంచి బీబీసీకి వెల్లడించారు.

# వారి కళ్లలో ఆనందమే మా సంతోషం

మొదటి పేజీ తరువాయి

నెల్లూరు, జులై 1: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. జిల్లాలోని మన్సూర్ నగర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిమంత్రి నారాయణ ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి నెలా 1వ తేదీ పెద్ద పండుగలా పింఛన్ల పంపిణీ సాగుతుందని తెలిపారు. ఏపీలో 67 లక్షల మంది కళ్లలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. ఏడాదికి రూ.34 వేల కోట్లు పింఛన్ల పంపిణీకి ఖర్చు చేస్తున్నామని.. త్వరలోనే రైతులకు రూ.20 వేలు అందిస్తామని వెల్లడించారు. అలాగే ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకానుందన్నారు. తామిచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి తీరుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



### పింఛన్ల పంపిణీలో చరిత్ర: ఎంపీ వేమిరెడ్డి

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, క్రమం తప్పకుండా రూ.4 వేలు చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీలో చరిత్ర సృష్టించారన్నారు. వైసీపీ చెడు ఆలోచనలతో తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. మంత్రి నారాయణ రేయింబవళ్లు శ్రమిస్తున్నారని.. ఆయన జిల్లా మంత్రిగా ఉండటం అందరి అదృష్టమని ఎంపీ వేమిరెడ్డి కొనియాడారు. పింఛన్ల పంపిణీ అనంతరం నగరంలోని ఆర్ఎస్ఆర్, వీఆర్ స్కూళ్లను ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ పరిశీలించారు. అలాగే వీఆర్ హైస్కూల్ పిల్లలకు కొద్దిసేపు పాఠాలు భోదించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..'నేను ఋుషీవ్యాలీ స్కూల్‌లో చదివా. అంతకంటే గొప్పగా వీఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దారు. రూ.లక్షకి పైగా ఫీజులు చెల్లిస్తే కానీ అందని కార్పోరేట్ విద్యని పేద పిల్లలకు ఉచితంగా అందించడం సంతోషం. మూతపడ్డ స్కూల్‌ను అంతర్జాతీయ స్థాయి స్కూల్‌గా తీర్చిదిద్దడం సాధారణ విషయం కాదు. 1050 సీట్లు ఉంటే, 5 వేల దరఖాస్తులు వచ్చాయి. అవకాశం రానివారికి వచ్చే ఏడాది తప్పకుండా అవకాశం కల్పిస్తాం. మంత్రి నారాయణ చరిత్రలో నిలిచిపోతారు. విద్యా వ్యవస్థలో మంత్రి లోకేశ్ విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నారు. ఈ నెల 7న వీఆర్ హైస్కూల్‌ను లోకేష్ ప్రారంభించనున్నారు' అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ పునరుజ్జీవనం

# కోసం తాపత్రయం

మొదటి పేజీ తరువాయి

అందుకోసం పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబుతోపాటు తెలంగాణ ప్రభుత్వాన్ని భూతాలుగా చూపుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలను విమర్శించారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కూర్చొని క్షుద్రపూజలు చేసినట్లుగా ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. క్షుద్ర పూజలు చేసే ఫామ్ హౌస్ నాయకుడికి ఇదొక్కటే పార్టీకి జీవనాదారం అనుకుంటున్నారన్నారు. అందుకోసమే తమ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల నీటి హక్కులను కాపాడాల్సి ఉందన్నారు. నీటితో తెలంగాణ ప్రజలకు అనుబంధం ఉందని గుర్తు చేశారు. నీళ్ల విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశాయి. బీఆర్ఎస్ నేతలు తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకు శాపంగా మారాయన్నారు. నీళ్లలో జరిగిన అన్యాయమే ప్రత్యేక రాష్ట్ర సాధనకు పునాది పడిందని గుర్తు చేశారు. తెలంగాణ జలాల విషయంలో రాజీ పడేది లేదని కుండబద్దలు కొట్టారు. సాంకేతికంగా, రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నీటి పారుదల శాఖను కేసీఆర్, హరీష్‌రావు చూశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ నీటి హక్కులను వాళ్లు కాపాడతారని అంతా భావించారని.. కానీ వాళ్లే రాష్ట్రానికి నష్టం చేశారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలపై ఆయన నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వంలో నీటి హక్కుల కోసం చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో గత ప్రభుత్వ నిర్ణయాలు మనకు గుదిబండగా మారాయని వివరించారు. కృష్ణా నదీ పరీవాహక ప్రాజెక్టులను గత ప్రభుత్వం పూర్తి చేయలేదని గుర్తు చేశారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయించారన్నారు. ఈ 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని 2015లో నాటి సీఎం కేసీఆర్ సంతకం చేశారని వివరించారు. అలాగే 68 శాతం జలాలు ఏపీకి కేటాయిస్తే తమకు ఏం అభ్యంతరం లేదని కూడా సంతకం చేశారన్నారు. 299 టీఎంసీలు సరిపోతాయని కేసీఆర్ తెలంగాణకు మరణశాసనం రాశారని మండిపడ్డారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం సైతం మొగ్గు చూపలేదన్నారు. ఏపీ పూర్తి చేసిన ప్రాజెక్టులకు నీటిని తరలించుకు పోతోందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో రూ. 38 వేల కోట్లతో ప్రాణహిత -చేవెళ్లను చేపట్టారన్నారు. ప్రాణహిత - చేవెళ్లను పక్కన పెట్టి ముఖ్యమంత్రిగా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను చేపట్టారని వివరించారు. కమీషన్లకు కక్కుర్తిపడి రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని చెప్పారు. రూ. లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టుతో 168 టీఎంసీలు మాత్రమే ఎత్తి పోశారని గుర్తు చేశారు. 168 టీఎంసీలు ఎత్తి పోసేందుకు రూ. 7 వేల కోట్ల కరెంట్ బిల్లు ఖర్చయిందని వివరించారు. ఎత్తి పోసిన 168 టీఎంసీల్లో మళ్లీ 112 టీఎంసీలు వృథాగా కిందకు వదిలారన్నారు. చచ్చిన పార్టీని బతికించుకునేందుకు మళ్లీ జలాల సెంటిమెంట్‌ను ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. ఏపీని బూచిగా చూపి పార్టీని బతికించుకునేందుకు ఫామ్ హౌస్‌లో క్షుద్ర పూజలు చేశారని చెప్పారు. గత 10 ఏళ్లలో 220 టీఎంసీలకు మించి సద్వినియోగం చేసుకోలేదన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే మన నీటి హక్కులను సద్వినియోగం చేసుకునే వాళ్లమన్నారు.

# బనకచర్లపై తమ వాదనతో ఏకీభవించిన కేంద్రం

అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదిలో ఏపీకి ఎక్కువ నీళ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఒప్పుకొని తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు మొదలయ్యాయిని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు తాము చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. తమ వాదనతో కేంద్రం ఏకీభవించిందని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

# కొబ్బరి నీళ్లతో ముంజలు - ఏడాదికి రూ.8 కోట్ల ఆదాయం

### 'కోకోముంజ్' పేరుతో ఓ బ్రాండ్? సృష్టించిన యువకుడు

### – కొబ్బరితో 60కి పైగా పదార్థాలను తయారు చేస్తున్న విజయవాడకు చెందిన వికాస్

: ఉద్యోగం వస్తుందో రాదోనని, వచ్చినా ఎంత కాలం ఉంటుందోనని చాలామంది యువత తీవ్ర వేదనకు లోనవుతున్నారు. కొందరు మాత్రం తమ అభిరుచికి సృజనాత్మకతను చేర్చి కోట్లు సంపాదిస్తున్నారు. ఈ కోవలోకే వస్తారు విజయవాడకు చెందిన వికాస్. కోస్తా కొబ్బరికి గుర్తింపు తీసుకురావాలన్న ఆశయంతో విజయవాడకు చెందిన వేపూరి వెంకట వికాస్ సృజనాత్మక ప్రయోగాలు చేశాడు. 'కోకోముంజ్' పేరుతో ఓ బ్రాండు సృష్టించి కొబ్బరితో వివిధ ఆహారం పదార్థాలు తయారు చేసి వ్యాపారం చేస్తున్నాడు. ఏకంగా 60కి పైగా పదార్థాలను తయారు చేయడమే కాకుండా, ఇందులో ప్రతిదీ వినూత్నమే. వీటన్నింటినీ కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలోని పరిశ్రమలోనే రెడీ చేసి విజయవాడలో విక్రయిస్తున్నారు. త్వరలో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు.

### తాటిముంజను తలపించే రుచి:

తాటి ముంజలు గురించి చాలామందికి తెలుసు. ఇక్కడ మాత్రం కొబ్బరి ముంజలు తయారు చేస్తున్నారు. ఎలాంటి రంగు, రసాయనాలు కలపకుండా కేవలం కొబ్బరి నీళ్లనే ప్రాసెస్ చేసి తాటిముంజను తలపించే రుచిని అందిస్తున్నారు. కోల్డ్‌బ్రూస్ కాఫీ నీళ్లతో తయారు చేస్తే, ఇక్కడ మాత్రం కొబ్బరి నీళ్లతో చేస్తున్నారు. కొబ్బరి తురుము, పాలు, నీటితో 20కి పైగా వంటకాలు, 40 రకాల కేక్‌లు, ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, మిల్క్‌షేక్‌లు, కాఫీ తదితర పదార్థాలు తయారు చేస్తున్నారు. పిజ్జా తయారీలో మైదా మోతాదు తగ్గించి కొబ్బరి పిండి ఉపయోగిస్తున్నారు. పాస్తాలో పాల క్రీమ్ బదులు కొబ్బరి క్రీమ్, కొబ్బరి పాలతో ఐస్‌క్రీమ్, ఆయిల్‌లో వేయించకుండా వేడి గాలి యంత్రాలతో చిప్స్ తయారు చేస్తున్నారు. కొబ్బరిపాలతో బెల్జియన్ చాక్లెట్, డార్క్ చాక్లెట్, జాక్‌ఫ్రూట్, మామిడి, సీతాఫలం, లోటస్ బిస్కాఫ్ వంటి ఫ్లేవర్లతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నారు. కొబ్బరి పాలు పోసి చిక్కని కాఫీ తయారుచేస్తారు. ఇందులో చెరకు నుంచి తీసిన చక్కెర కాకుండా కొబ్బరి గెల నుంచి వచ్చే నీరాతో చేసిన చక్కెర, తేనె ఉపయోగిస్తారు.

### రంగులు, రసాయనాలు వినియోగించరు:


ప్రస్తుతం నాణ్యత లేని నాసిరకం, కల్తీ ఆహారం రాజ్యమేలుతోంది. తయారీలో వాడే నూనెలు మొదలు అన్నీ ఆరోగ్యాన్ని పాడు చేసేవే. ఇక్కడ తయారు చేసే పదార్థాలలో రంగులు, రసాయనాలు వినియోగించరు. ఏ పదార్థాన్నీ 2, 3 రోజులకు మించి నిల్వ ఉంచరు. కొబ్బరి నుంచి ఐరన్, మెగ్నీషియం, కాపర్, జింక్, మాంగనీస్ తదితర ఖనిజాలు సమృద్ధిగా అందుతాయి. చక్కెర, పాలు, మైదా వంటి పదార్థాలను కొబ్బరితో భర్తీ చేయడంతో రుచితో పాటు కొత్త అనుభూతి కలుగుతోంది. రక్తంలో చక్కెర స్థాయులను తగ్గించడంతో మధుమేహం నియంత్రణలో ఉంటుంది. నీరసం, మలబద్ధకం, థైరాయిడ్ వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. చర్మం పొడిబారడం, వెంట్రుకలు చిట్లిపోవడం తగ్గిపోతుంది. కొబ్బరి నీళ్ల వల్ల చెడు కొవ్వు కరుగుతుంది. కొబ్బరి పాలలో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో జీవక్రియ సైతం మెరుగుపడుతుంది.రైతు కుటుంబం నుంచి వచ్చి: వికాస్ రైతు కుటుంబం నుంచి వచ్చాడు. పూర్వీకులు పశ్చిమ గోదావరి జిల్లాకి చెందిన వారు కావడంతో కొబ్బరిపై అభిమానంతో దానినే తన వ్యాపార వస్తువుగా ఎంచుకున్నాడు. 2019లో కొబ్బరి పొడి పరిశ్రమను ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు పోగొట్టుకున్నా వెనక్కి తగ్గలేదు. కోకోముంజ్ స్థాపించి విజయం

# సంపాదకీయం

## ఇరాన్‌లో మనకు కనిపించని ఇంధనమూ ఉంది!

మానవ చరిత్రలో రాజ్యాలు మొదలైన దగ్గర నుంచి రెండు విషయాలు క్రమం తప్పకుండా కనపడతాయి. రాజ్యరక్షణ.. రాజ్యభక్షణలుగా వాటి గురించి చెప్పుకోవచ్చు. సందర్భానుసారం వీటిల్లో ఏదో ఒకదాంట్లో మునిగిపోయి, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయటం పాలకవర్గాలకు పరిపాటి. ప్రజాస్వామ్యాలు, అంతర్జాతీయ చట్టాలు వచ్చిన తర్వాత కూడా ప్రజలకు ఇవి తప్పటంలేదు. రాజ్యరక్షణకు పొరుగు దేశాలను భక్షించక తప్పదనే చాణక్యనీతితో జరిగిన యుద్ధాలను తెలుసుకోటానికి గడిచిపోయిన చరిత్రల్లోకి వెళ్లాల్సిన పనిలేదు. ఇప్పటికీ అవి ప్రబలంగానే ఉన్నాయి. యుద్ధాలకు సమర్థనలు మాత్రమే మారుతున్నాయి. రాజ్యం వీరభోజ్యం లాంటి ముతక సమర్థనలు పోయి జాతీయ ప్రయోజనాలు, స్వీయరక్షణ పేరుతో యుద్ధాలు పేట్రేగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికాలు కలిసికట్టుగా ఇరాన్‌పై 12 రోజుల పాటు చేసిన యుద్ధమే ఇందుకు నిదర్శనం. ఇజ్రాయెల్‌కూ ఇరాన్‌కూ సరిహద్దు తగాదాలు లేవు. రెండిటికీ మధ్య వందల కిలోమీటర్ల దూరం ఉంది. ఇరు దేశాల రాజధానుల మధ్య దూరమే 1770 కిలోమీటర్ల దాకా ఉంటుంది. అరబ్ దేశాలతో ఇజ్రాయెల్‌కు యుద్ధాల చరిత్ర ఉంది. 1948 నుంచి ఏదో ఒక కారణంతో ఆ దేశాలతో తలపడి వాటి భూభాగాలను ఆక్రమించటం, వైదొలగటం ఇజ్రాయెల్‌కు మామూలే. అరబ్%-%ఇజ్రాయెల్ యుద్ధాల్లో ఇరాన్ ప్రత్యక్ష భాగస్వామి కాదు. మరి ఇరాన్‌తో ఇజ్రాయెల్‌కు ఎందుకు ఇంత శత్రుత్వం? వందలాది యుద్ధ విమానాలతో దాడిచేయటమే కాకుండా, అమెరికాను కూడా రంగంలోకి దించి అణుశుద్ధి కేంద్రాలపై భీకరమైన బంకర్ల విధ్వంసక బాంబులతో విరుచుకుపడటానికి వినిపిస్తున్న సమర్థనల వెనుక అసలు నిజాలు ఏమిటి? ఇరాన్ అణుకార్యక్రమానికి ఒకనాడు పాశ్చాత్యదేశాల ప్రాపకం లేదా? అమెరికా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ ఎందుకు తీవ్రశత్రువుగా మారిపోయింది? ముస్లిందేశాల నడిబొడ్డున తిష్టవేసుకుని తన ఆధిపత్యాన్నీ ఆక్రమణలనూ ఆ దేశాలు కిక్కురుమనకుండా ఆమోదించటానికి ఇజ్రాయెల్ సాగిస్తున్న రణతంత్రం ఎటు దారితీస్తుంది? ఈ ప్రశ్నలకు జవాబుల కోసం చరిత్రను వెతికితే అమెరికానే బోనులో నిలబడుతుంది. పాశ్చాత్యదేశాలు చేసిన పాపపు చరిత్రే కనపడుతుంది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీర్మానం ప్రకారం ఇజ్రాయెల్‌తో పాటు పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడాలి. రెండిటికీ సరిహద్దులూ అప్పట్లో స్పష్టంగానే నిర్దేశితమయ్యాయి. ఆ తీర్మానం అమలయ్యేలోపలే బలప్రయోగంతో పాలస్తీనాకు కేటాయించిన భూభాగాలను సైతం ఆక్రమించుకోవటంతోనే అసలు సమస్య మొదలైంది. అరబ్ దేశాలు ఆనాడు ఇజ్రాయెల్ ఏర్పాటును మొండిగా వ్యతిరేకించటం ఇప్పటి దృష్టితో చూస్తే వ్యూహాత్మక తప్పిదంగా అనిపిస్తుంది. దానికి మూల్యం మాత్రం పాలస్తీనా ప్రజలు చెల్లించాల్సి వచ్చింది. ఒకటి మాత్రం నిజం. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ఏర్పాటు కాకుండా చూడాలనే వ్యూహంతోనే యూదు ఆధిపత్యవాదులు మొదటి నుంచి పావులు కదిపారు. చివరికి గాజా, వెస్ట్‌బ్యాంక్ భూభాగాలతో పరిమిత పాలస్తీనాను ఏర్పాటు చేయటానికి కూడా ఇజ్రాయెల్ అంగీకరించటం లేదు. గతంలో పాలస్తీనాగా గుర్తించిన భూభాగంలో ఏ ముక్కనూ ఒదులుకోటానికి ఇజ్రాయెల్ సిద్ధంగా లేదు. నెతన్యాహు సారథ్యంలోని ఇజ్రాయెల్ ప్రభుత్వం.. స్వతంత్ర పాలస్తీనా అన్న భావననే లేకుండా చేయటానికి ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకుంటోంది. గాజాలో నరమేధమూ అందుకే సాగుతోంది. మధ్య ప్రాచ్యంలో తిరుగులేని ఆధిపత్యం ఇజ్రాయెల్‌కు ఏర్పడేలా నెతన్యాహు చేస్తున్న ప్రయత్నాలకు ఇరాన్ శక్తి అడ్డంకిగా కనపడుతోంది. 12 రోజుల యుద్ధమూ అందులో భాగమే. మతపరంగానో, ఇతర భావజాలంపరంగానో అమెరికా, ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని అంగీకరించని ఏ దేశాన్నైనా అస్థిరం చేయటం దశాబ్దాలుగా అమలవుతోంది. చమురు, సహజవాయువులు సమృద్ధిగా ఉన్న దేశాలను నయానభయాన గుప్పిట్లో పెట్టుకోవటం ఒకప్పుడు బ్రిటన్ చేస్తే రెండో ప్రపంచయుద్ధం తర్వాత అమెరికా ఆ పనిని మొదలుపెట్టింది. మధ్యప్రాచ్య దేశాల మధ్య విభేదాలను ఎగదోయటం, సందర్భానుసారం కొన్నిటిని మిత్రపక్షాలుగా, మరికొన్నిటిని వైరిపక్షాలుగా భావించటం, వాటి రక్షణ పేరుతో యుద్ధాలు చేయటం, తిరుగుబాట్లను ప్రోత్సహించటం అమెరికా విదేశాంగ విధానంలో కీలక వ్యూహంగా మారింది. అణువిద్యుత్తు పేరుతో అణ్వస్త్రాలు తయారుచేయగలిగే స్థాయికి యురేనియాన్ని ఇరాన్ శుద్ధిచేస్తోందని అమెరికా, ఇజ్రాయెల్‌లు ఆరోపిస్తున్నాయి. నిజానికి ఇరాన్ అణుకార్యక్రమం ఈనాటిది కాదు. అమెరికాకు, పాశ్చాత్య దేశాలకు అన్నివిధాలుగా అనుకూలంగా వ్యవహరించిన ఒకనాటి ఇరాన్ పాలకుడు ముహమ్మద్ రెజాషా పహ్లవి (1941%-%1979) కాలంలోనే అది పెద్దఎత్తున మొదలైంది. అమెరికా ఆశీస్సులతో రెజాషా 23 పౌర అణువిద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయటానికి ప్రణాళిక రూపొందించారు. సొంత అవసరాలకే కాకుండా చుట్టుపక్కల దేశాలకు కూడా విద్యుత్తు సరఫరా చేయాలనే ఉద్దేశంతో వాటిని ఏర్పాటు చేయబోతున్నట్లు రెజాషా ప్రకటించారు. రెండు కేంద్రాలకు సంబంధించి అప్పట్లోనే పనులు మొదలయ్యాయి. ఇరాన్ లాంటి చిన్న దేశంలో ఒక్కసారిగా 23 అణువిద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు అంగీకరించటం అప్పట్లో అమెరికాకు అసంబద్ధంగా అనిపించలేదు. ఇరాన్ దగ్గర త్వరలో అణ్వస్త్రాలు కూడా ఉంటాయని అమెరికన్ జర్నలిస్టుతో రెజాషా గర్వంగా కూడా చెప్పారు. ఇటీవల ఇజ్రాయెల్ వైమానిక దాడుల సందర్భంగా దెబ్బతిన్నట్లు వార్తల్లోకి ఎక్కిన బుషెహర్ అణువిద్యుత్తు కేంద్రం రెజాషా ప్రకటించిన 23 కేంద్రాల్లో ఒకటి. అపార చమురు, సహజవాయువు నిల్వలున్న ఇరాన్‌కు అణువిద్యుత్తే అవసరం లేదన్న వాదనలు అమెరికా మేధావులు ఇప్పుడు చేస్తున్నారు కానీ ఒకనాడు ఆ ఆలోచనే వాళ్లకి తట్టలేదు. 1970ల్లో అమెరికా విదేశాంగమంత్రిగా హెన్రీ కిసింజర్ ఇరాన్

## ఎందుకొచ్చిన 'సర్'?!




దేశంలో ఎన్నికలు జరిగినప్పుడల్లా ఆరోపణలు రావటం, మౌనంగా ఉండిపోయి నెలలు గడిచాక ముక్తసరిగా మాట్లాడటం ఎన్నికల సంఘం(ఈసీ)కి అలవాటైపోయింది. ఈసారి మార్పేమిటంటే... ఓటర్ల జాబితా సవరణ దశలోనే దానిపై ఆరోపణలు రావటం! రాజ్యాంగంలోని 326వ అధికరణం ప్రకారం పద్దెనిమిదేళ్లు నిండిన భారతీయ పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవాలి గనుక దానికి అనుగుణంగా ఈ దఫా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఈసీ చెబుతోంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కింద ఓటర్ల వివరాలు సేకరిస్తామంటున్నది. ఇదే మాదిరి సవరణ 2003లో జరిగింది. కానీ ఆ 'సర్' వేరు! అప్పట్లో ఇంటింటికీ వెళ్లి జాబితాలోని ఫొటోలతో ఓటర్లను పోల్చిచూడటం, అనుమానాస్పదం అనిపిస్తే తొలగించటం వగైరాలు చేశారు. 2003 జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకుని, ఆ తర్వాత జాబితాల్లోకి ఎక్కినవారందరినీ సంశయ ఓటర్లుగా పరిగణించి వారి నుంచి వివిధ పత్రాలు అడగాలన్నది ఈసీ తాజా నిర్ణయం. ఇవన్నీ 1955 నాటి జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్‌సీ)లో నిర్దేశించిన పత్రాలు. సారాంశంలో ఈ ఓటర్లంతా జాబితాలో కెక్కాలంటే ముందుగా ఈ దేశ పౌరులమని నిరూపించుకోవాల్సి ఉంటుంది. తమ పుట్టుకకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు మాత్రమే కాదు... తమ తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేయాలి. ప్రస్తుతం ఓటర్లను ఈసీ మూడు కేటగిరీలుగా విభజించింది. దాని ప్రకారం 1987 జూలై 1 లేదా అంతకుముందు జన్మించినవారు జనన ధ్రువీకరణ పత్రం లేదా పుట్టిన ఊరు ధ్రువీకరణ పత్రం... లేదా రెండూ సమర్పిస్తే సరిపోతుంది. జూలై 1, 1987%-% డిసెంబర్ 2, 2024 మధ్య జన్మించినవారు ఈ పత్రాలతోపాటు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి జనన లేదా ప్రాంత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఆ తర్వాత జన్మించినవారు తమ ధ్రువీకరణ పత్రాలతోపాటు తల్లిదండ్రులిద్దరివీ కూడా సమర్పించాలి. ఇవి అందజేయలేనివారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. తుది జాబితా ప్రచురణలోగా అందిస్తేనే తిరిగి చేరుస్తారు. ఎన్నికలను సక్రమంగా నిర్వర్తించటంలో తరచూ విఫలమవుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈసీ దొడ్డిదారిన ఎన్ఆర్‌సీని అమల్లో పెట్టజూస్తున్నదని విపక్షాలు చేస్తున్న ఆరోపణ కొట్టిపారేయదగ్గది కాదు. అలాగని దొంగ ఓటర్ల సమస్య లేదని కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, అటు తర్వాత రెండు విభజిత రాష్ట్రాల్లో వేర్వేరు పోలింగ్ తేదీలున్నప్పుడు తెలుగుదేశం దీన్నొక కళగా అభివృద్ధి చేసింది. అక్కడా ఇక్కడా ఓటేయించటం, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఓటర్లను తరలించటం ఆ పార్టీకి అలవాటైన విద్య. ఇక అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వగైరాల్లో బంగ్లాదేశ్, మయన్మార్‌ల నుంచి వచ్చినవారు ఓటర్లుగా నమోదై ఎన్నికల ఫలితాలు తారుమారు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే అందుకు సంబంధించిన డేటా ఈసీ ఇంతవరకూ బయటపెట్టలేదు. అది విడుదల చేసివుంటే ఈ వ్యవహారం ఇంత వివాదం అయివుండేది కాదు. కానీ అలా చేయటం తన స్థాయికి తగదని సంస్థ భావిస్తున్నట్టుంది. బిహార్ మాత్రమే కాదు... వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కూడా ఈ 'సర్' వచ్చిపడుతుందంటున్నారు. ఏడేళ్ల క్రితం అస్సాంలో ఈ దేశ పౌరులెందరు... ఇతరులెందరన్న ఆరా తీశారు. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వే తర్వాత 40.07 లక్షల మంది 'విదేశీయులని' నిర్ధారించారు. ఎన్నో ఆందోళనలు జరిగాక ఈ సంఖ్య 19 లక్షలకు తగ్గింది. వీరిలో అన్ని మతాలవారూ ఉండగా బిచ్చగాళ్లు, నిరుద్యోగులూ, ఇల్లూ వాకిలీ లేనివారూ ఎక్కువ. ఒక ఇంట్లో పెద్దన్న 'భారతీయుడైతే' మిగిలిన అన్నదమ్ములు 'విదేశీయులు'గా ముద్రపడిన వారున్నారు. భర్తకు ఎన్ఆర్‌సీలో చోటు దక్కితే భార్య పేరు గల్లంతయిన ఉదంతాలు కోకొల్లలు. సైన్యంలో రిటైరై, అస్సాం సరిహద్దు పోలీసు విభాగంలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే మహమ్మద్ సనావుల్లా పేరు సైతం మాయమైతే అరెస్టు చేసి నిర్బంధ శిబిరానికి తరలించారు. జాబితాలో ఉన్న కుటుంబ సభ్యులంతా గువాహటి హైకోర్టును ఆశ్రయించాక బెయిల్ దొరికింది. ఆ రాష్ట్రంలో ఏడేళ్లయినా ఇప్పటికీ లక్షల కేసులు తేలని నేపథ్యంలో ఇంత పని ఈసీ ఎందుకు నెత్తికెందుకుందన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది. బిహార్‌లో ఇప్పుడున్న ఓటర్ల సంఖ్య 7 కోట్ల 90 లక్షలు. ఇందులో 20%-%38 ఏళ్ల మధ్య వయస్కులు దాదాపు సగమని చెబుతున్నారు. ఈసీ లెక్క ప్రకారం ఈ సంఖ్య 2.93 కోట్లు. వీరు తమతోపాటు తమ తల్లిదండ్రుల్లో కనీసం ఒకరి పౌరసత్వాన్ని తేల్చిచెప్పాల్సి ఉంటుంది. నాలుగు నెలల్లో ఎన్నికలు పూర్తయి ప్రభుత్వం ఏర్పడాల్సిన బిహార్‌లో ఇది అంత తేలిగ్గా తేలే వ్యవహారమా? ఆ వంకన పాలక పక్షాల ఒత్తిడితో భారీయెత్తున ఓటర్లను తొలగించే ప్రమాదం ఉండదా? జాబితాలో చోటుదక్కనివారు న్యాయస్థానాలకెక్కితే పరిస్థితేమిటి? పాలకులుగా ఎవరున్నా పేదరికం రాజ్యమేలే బిహార్ నుంచి భారీయెత్తున వలసలుంటాయి. అక్కడ వృద్ధాప్య పింఛన్ నెలకు రూ. 700. ఇటీవలే దాన్ని రూ. 1,100 చేస్తున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆర్భాటంగా ప్రకటించారు. పనుల కోసం వందలాది కిలోమీటర్లు దాటి తెలుగు రాష్ట్రాలకు వలస వస్తున్నవారి సంఖ్య తక్కువేమీ కాదు. అక్కడి జనాభాలో 7 శాతం మంది వేరే రాష్ట్రాలకు పోగా, అందులో 30 శాతం మంది ఉపాధి వెదుక్కొని వెళ్లినవారే. వారంతా వెనక్కొచ్చి తమ పత్రాల కోసం వెతుకులాడటం జరిగే పనేనా? బిహార్‌లో సకాలంలో ఎన్నికలు జరుగుతాయని ఈసీ విశ్వసిస్తోందా?

## నానాకాలం చదువులు



'వానాకాలం చదువు'లంటారు. ఇప్పటికీ దేశంలో చాలాచోట్ల వానకీ, చదువుకీ చుక్కెదురే. చెట్ల కిందో, అరుగుల మీదో, అంతంతమాత్రపు కప్పు కిందో బడులు నడిపేటప్పుడుబీ చక్కా నడిచి పోడానికి పక్కారోడ్లు లేనప్పుడు వానాకాలంలో చదువుకు గంట కొట్టి ఇంటికి పరిమితమవక తప్పదు. వెనకటి కాలంలో చదువు చెప్పే రోజులతో సమానంగా నిషేధించే రోజులూ ఉండేవి. అష్టమి, నవమి, చతుర్దశి, అమావాస్య, పౌర్ణమి మొదలైన తిథుల్లో, గ్రహణం పట్టినప్పుడూ అధ్యయనం కూడదు. వాటిని 'అనధ్యయన దినా'లనేవారు. వేదాలు, ఇతర రహస్య విద్యల వల్లింపైతే వర్షాకాలంలో పూర్తిగా నిషిద్ధం. నేర్చుకున్నది మాత్రం నెమరు వేసుకోవచ్చు. క్రమంగా కేలండర్ మారిపోయి వర్షర్తువూ, చదువుల ఋతువూ ఒకేసారి మొదలవడం ప్రారంభించాయి. మినహాయింపులున్నా ఆ రెంటి మధ్యా వైరుధ్యం పోయి సయోధ్య వెల్లివిరుస్తోంది. వానలతో పచ్చదనాన్ని తెచ్చుకుని కొత్త ఉత్సాహాన్ని నింపుకొనే ప్రకృతితో చదువుల ఋతువు పోటీపడుతూ రహదారులనూ, బడితావులనూ పిల్లల సందడితో వర్ణరంజితమూ, కర్ణరంజితమూ చేస్తోంది. మరోపక్క విచిత్రంగా ముల్లు ఈ కొస నుంచి పూర్తిగా దాని వ్యతిరేక దిశకు తిరగడమూ జరుగుతోంది. చదువుల అభావ దినాలు పోయి ఉల్బణ దినాలు వచ్చాయి. ఋతు నిర్బంధాలూ, తిథివార నిషేధాలూ పోయి చదువుల కేలండర్ 'సార్వకాలికత'ను తెచ్చుకుంటోంది. వానా కాలం చదువులు పోయి నానాకాలం చదువులొచ్చాయి. అది మరోరకం వైపరీత్యానికి దారి తీసింది. అంతటా కాకపోయినా, అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో వేసవి సెలవులు కుదించుకుపోతున్నాయి. ప్రత్యేకించి పబ్లిక్ పరీక్షలు రాయబోయే పిల్లలకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ పైన వేసవి పొడవునా ట్యూషన్ తరగతులకు హాజరవడం అనివార్యమవుతోంది. భుజాలను వంచే పుస్తకాల బరువుకు తోడు మస్తకాలను భయాందోళనలతో నింపే చదువు బరువూ పెరిగిపోతోంది. 'స్కూలు వర్కు'ను మించి 'హోము వర్కు' నివ్వడంతో బడికీ, ఇంటికీ తేడా చెరిగిపోయి, వేరే వృత్తి ఉద్యోగాల్లో తలమునకలయ్యే తల్లితండ్రులే టీచర్లు గానూ మారి, అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. తల్లుల పరిస్థితి మరీ ఘోరం. ఉద్యోగానికి అదనంగా వంటపనీ, ఇంటిపనీ, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే ఉపాధ్యాయిని పాత్రనూ పోషించవలసి వస్తోంది. స్త్రీ, పురుష బాధ్యతల మధ్య అసమానతలు కొనసాగుతున్న పరిస్థితిలో గృహిణికి ఇదెంత భారమో ఊహించగలం. స్కూలు ఫీజులూ, ఇతరత్రా వసూళ్ల రూపంలో వేలు, లక్షలు ధారపోస్తున్నా తల్లితండ్రులకు 'టీచరీ' రూపంలో ఈ అదనపు చాకిరీ తప్పడం లేదు. ఆటపాటలతో సహా ఇతరేతర మానసికోల్లాసాలకు ఒకటి, రెండు గంటలైనా ఒత్తిడి లేని స్వేచ్ఛా సమయం చిక్కని పిల్లల పాలిట చదువు అక్షరాలా 'నిర్బంధ' విద్యే అవుతోంది. విద్యాసంస్థలు చదువు బరువు తగ్గించకుండానే అదనపు వేళల్లో ఆటపాటల బరువునూ మోపడంతో పిల్లలకసలే ఊపిరి సలపడం లేదు. దేశంలో విద్యాబోధన ఎంత శాస్త్రీయంగా జరుగుతోందో పట్టించుకునే వ్యవస్థ అసలేదైనా ఉందా, చదువులు పిల్లల శారీరక మానసిక వికాసానికేమైనా సాయపడు తున్నాయా అన్న ప్రశ్నలు తల్లితండ్రుల నుంచే ఎదురవుతున్నాయి. పరీక్షలలో సాధించాల్సిన మార్కుల గరిష్ఠ శాతం కూడా ఇప్పుడు మారిపోయింది. తదుపరి చదువుకు ఏ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలోనైనా సీటు రావడానికి డెబ్బై, ఎనభై శాతం మార్కులు కూడా సరిపోవడం లేదు, తొంభై శాతం దాటి తీరాల్సిందే. దాంతో పిల్లల్లో పోటీ, అసూయ, అలజడి, ఆందోళన, ఒత్తిడి పెరిగి పోతున్నాయి. తమ చదువూ, భవిష్యత్తుల గురించి తల్లితండ్రులు కనే కలల భారం పిల్లల కను రెప్పల మీద పడి వాళ్ళ నిద్రను హరిస్తోంది. పిల్లల్లో గ్రహణశక్తి, చురుకుదనం పెరిగిన మాట నిజమే కానీ, మొత్తంగా నేటి ఈ చదువుల తీరు ఆదర్శవంతమేనా అన్న సందేహం మాత్రం వదలకుండా వేధిస్తూనే ఉంది. ఇక చదువుల్లో రకరకాల అసమానతలు పెరగడమే తప్ప తగ్గుతున్న జాడలేదు. ఉజ్జ్వల భవిష్యత్తు వైపు నడిపించే చదువుల నిచ్చెనపై చివరి మెట్ల మీద చతికిల బడుతున్నవారు నేటికీ అసంఖ్యాకమే. ఇంకోవైపు నూటికి నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి ప్రభుత్వాలు ఇప్పటికీ ఆపసోపాలు పడుతూనే ఉన్నాయి. నూటయాభయ్యేళ్ళ క్రితం, బ్రిటిష్ వలస పాలన ప్రారంభం నాటికి మూడు శాతం పైచిలుకు ఉన్న అక్షరాస్యత ఇప్పుడు ఎనభై శాతానికి చేరడం, విడిగా చూసినప్పుడు ఒకింత ఊరటే కానీ, ఎన్నో దేశాలతో పోల్చితే ఈ పెరుగుదల వేగమూ, శాతమూ ఏమంత విశేషం కావని పెదవి విరిచేవారూ ఉన్నారు. ఇందులో మళ్ళీ ప్రాంతీయంగా, జెండర్ పరంగా అంతరాలూ యథాతథం. ఎప్పుడో కానీ సోదిలోకి రాని ఈశాన్య రాష్ట్రాలు అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉండటం ఒక విశేష మైతే, ఎంత ప్రామాణికమో తెలియదు కాని, బిహార్‌తో కలసి ఆంధ్రప్రదేశ్ ఆ పట్టికలో అడుగు బొడుగు స్థానాలలో కనిపించడం కలవరపరిచే విషయం. ఇక చదువుల నాణ్యత విషయానికొస్తే, పట్టికలో మన దేశం స్థానం ఉసూరుమనిపించే మరో అధ్యాయం. చదువుకీ, మంచి రాబడిగల ఉద్యోగాలకూ పీటముడి పడిన దశలో విద్యాభ్యాసం పూర్తిగా పరుగు పందెంగా మారి పిల్లల్ని విపరీత శ్రమకూ, అలసటకూ గురిచేస్తున్న మాట నిజం. చదువుల మరో పరమార్థమైన జ్ఞాన సముపార్జనకు కూడా పెద్ద పీట వేస్తూ ఎప్పటికది నిలకడ తెచ్చుకుంటుందో, పిల్లల్ని పరీక్షల భయతీరాన్ని దాటించి వైజ్ఞానికపు వెలుగుల ఉల్లాస తీరం వైపు నడిపిస్తుందో కాలమే తేల్చాలి.

## కేసీఆర్ సాగుబడికి కితాబు



రాష్ట్రాన్ని సాధించడంతోనే కేసీఆర్ సంతృప్తి పడిపోలేదు. ప్రజలు అప్పగించిన అధికారాన్ని సద్వినియోగం చేసుకొని సుజల, సుఫల సీమగా తీర్చిదిద్దారు. జల సమృద్ధితో జన సౌభాగ్యాన్ని సాధించారు. వెనుకవేయబడిన ప్రాంతాన్ని ముందుకుతెచ్చారు. అపూర్వ మేధోమథనంతో, అద్వితీయ పరిపాలనా పటిమతో అగ్రస్థానంలో నిలబెట్టారు. ఆ అభివృద్ధిలో వ్యవసాయానికి పెద్దపీట వేశారు. మిషన్ కాకతీయ పేరిట చెరువుల పూడికతీతతో శ్రీకారం చుట్టారు. 46 వేల పైచిలుకు చెరువులను, కుంటలను పునరుద్ధరించారు. వ్యవసాయానికి కావాల్సిన కీలక వనరు అయిన సాగునీరు పుష్కలంగా లభించేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, దేవాదుల వంటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేశారు. 1200కుపైగా చెక్‌డ్యామ్‌లను చేపట్టి 650కి పైగా పూర్తిచేశారు. ఈ కృషికి కాళేశ్వరం ఎత్తిపోతల ఓ కీర్తి కిరీటం లాంటిది. మరోవైపు రైతుల పంట పెట్టుబడి సమస్యకు శాశ్వతంగా ముగింపు చెప్తూ రైతుబంధు తీసుకువచ్చారు. విత్తనాలు, ఎరువుల సమస్య లేకుండా చేశారు. చివరి గింజవరకూ సేకరిస్తూ, ధాన్యం కొనుగోళ్లను తారాస్థాయికి తీసుకువెళ్లారు. గోదాముల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టి ధాన్యం నిల్వ సమస్య తీర్చారు. రైతుబీమాతో అన్నదాతల కుటుంబాలకూ భరోసా కల్పించారు. ఇవన్నీ కూడా కేంద్రం సహాయ నిరాకరణ మధ్యనే జరిగాయనేది వాస్తవం. ఇప్పుడు అదే కేంద్రం విడుదల చేసిన అర్థ గణాంకాలు తెలంగాణ సాధించిన సస్యవిప్లవానికి దివిటీ పడుతున్నాయి. దార్శనిక నేత పాలనలో తెలంగాణ అంచెలంచెలుగా దేశానికి ధాన్యాగారంగా ఎదిగిన వైనాన్ని వేనోళ్ల చాటుతున్నాయి. 2011-12 నుంచి 2023-24 మధ్యకాలంలో దేశంలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో జరిగిన సంపద సృష్టిపై కేంద్రం తాజాగా నివేదికను విడుదల చేసింది. రాష్ట్రం ఏర్పాటైన ఏడాది, అంటే 2014-15లో, తెలంగాణలో సాగు దిగుబడి విలువ రూ.45 వేల కోట్లు బీఆర్ఎస్ పరిపాలన చివరి ఏడాది, అంటే 2023-24లో రైతులు పండించిన పంట విలువ అక్షరాలా రూ.1.16 లక్షల కోట్లు. పదేండ్ల పాలనలో రూ.70 వేల కోట్ల దిగుబడి విలువ పెరిగి రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపింది. ఇదీ సంపద పెంచే చేతులు సాధించిన అభివృద్ధి. ఇదీ కేసీఆర్ సంకల్పసిద్ధి. ఇది కేవలం సాగురంగంలో సాధించిన సంపద. పారిశ్రామిక, ఐటీ ఇతరరంగాల్లో సాధించిన అభివృద్ధి వేరే కథ. రూ.80 వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతిని చూసే కుళ్లుబోతు నేతలకు ఇది అర్థం కాదు. లేదా కండ్లు మూసుకున్నట్టు నటిస్తారు. కాదు కాదు, అసలు అభివృద్ధే జరుగలేదని బుకాయించజూస్తారు. కేసీఆర్ వల్ల రాష్ట్రం అప్పులపాలైందని దబాయించజూస్తారు. నిజం నిప్పులాంటిది. దానిని గడ్డీగాదం వేసి కప్పాలనుకుంటే మాడి మసైపోతాయి. నిజం జాజ్వల్యమానంగా ఎగదన్నుకువస్తుంది తప్ప అణగిపోదు. కేసీఆర్ పాలన తెలంగాణకు అపూర్వ స్వర్ణయుగాన్ని సాధించి చూపింది. ఇది ప్రజలకు అనుభవపూర్వకంగా తెలిసిన నిజం. ఈ నిజానికి మసిపూసేందుకు కాంగ్రెస్ సర్కారు పెద్దలు చెయ్యని చేతా లేదు, కుయ్యని కూతా లేదు. గాలివాటంగా గద్దెనెక్కి, పరిపాలన చేతకాక రోజుకోసారి బీఆర్ఎస్ పరిపాలనపై 'వైరభక్తి' చాటుకుంటుంటారు. భరోసా లేని పాలనతో ఏ రంగంలోనూ సుపరిపాలన సాధించలేక చతికిలబడి, తమ తప్పులన్నీ ఇదివరకటి సర్కారు ఖాతాలోకి తోసేయాలని చూస్తుంటారు. కానీ, నిజం ఎగదన్నుకువస్తుంది. సమున్నతంగా రెపరెపలాడుతుంది. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ మారిందనేది దాస్తే దాగని సత్యం. చావులేని ఆ సత్యం మార్మోగుతుంది అనునిత్యం.

# తొలి ఏడాదిలోనే ౯౦ శాతానికి పైగా హామీలు నెరవేర్చాం

### ఇంటింటికి వెళ్లి మనం చేసిన మంచిని వివరించండి

### నెల రోజుల పాటు డోర్ టు డోర్ వెళ్లాలి

### పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ దిశా నిర్దేశం





రాప్తాడు నియోజకవర్గం,**కదిలించే వార్త/ జులై 01:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 90% పైగా హామీలు నెరవేర్చామని.. ప్రతి ఒక్కరు ఇంటింటికి వెళ్లి మనం చేసిన అభివృద్ధి గురించి సంక్షేమం గురించి వివరించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి సంబంధించి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బూత్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు, మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నుంచి నెల రోజుల పాటు నిర్వహించాలన్నారు. బూత్, యూనిట్, క్లస్టర్ ఇంచార్జిలు మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కెఎస్-ఎస్ సభ్యులు డోర్ టు డోర్ వెళ్లాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లోను ఒక రోజుకు 50 కుటుంబాలను కలవాలని.. ఇంటి వద్ద కనీసం ఐదు నిమిషాల పాటు మాట్లాడి ఏడాది కాలంలో మనం చేసిన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై అభిప్రాయాలు, ఇంకా ఏవైనా సంక్షేమ పథకాలు అందాల అన్న అంశాల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన స్పందనను అలాగే వారి సమస్యల గురించి ఎప్పటికప్పుడు ఆ ఇంటి వద్ద నుంచే మై టిడిపి యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఏ సమస్య ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని... పార్టీ అధిష్టానం ఇచ్చిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పెన్షన్ల పెంపు, మెగా డీఎస్సీ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం.. త్వరలో అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాల గురించి వివరించాలన్నారు. అలాగే గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్మిస్తున్న రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా తెలియజేయాలన్నారు. రాప్తాడు సమీపంలో వైసిపి నాయకులు జాకీ పరిశ్రమను వెళ్లగొడితే మనం రేమండ్ కంపెనీ తెచ్చిన విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండవద్దని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ సూచించారు.

## ఐసిఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్ పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా చార్టెడ్ అకౌంట్ దినోత్సవం



వరంగల్ **కదిలించే వార్త/ జులై 01:** ఐసిఏఐ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చార్టెడ్ అకౌంట్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ చైర్మన్ పూజారి సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఐ బ్రాంచ్ ఆవరణంలో సి ఎ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జులై 1న దేశవ్యాప్తంగా చార్టెడ్ అకౌంట్ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. దీనిలో భాగంగానే వరంగల్ శాఖ ఆధ్వర్యంలో గత ఐదు రోజుల నుండి ఇండోర్ అవుట్డోర్ వివిధ రకాల క్రీడలను నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా యువత తమ భవిష్యత్తులో స్థిరపడే విద్యను అభ్యసించినట్లయితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు అని అన్నారు. దీనిలో భాగంగానే దేశవ్యాప్తంగా 140 కోట్ల జనాభాలో కనిష్ట నిష్పత్తిలో చార్టెడ్ అకౌంట్ లో రాణిస్తున్నట్లు వివరించారు. ఈ విద్యను అభ్యసించడానికి నిర్వహించి పరీక్షల్లో స్వల్ప వ్యవధిలో ఉత్తీర్ణత శాతం నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వరంగల్ శాఖ ఆధ్వర్యంలో సీఏ విద్యపై విద్యార్థి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీఏ విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం శాశ్వత భవన నిర్మాణానికి భూ కేటాయింపు చేస్తే భవన నిర్మాణానికి వరంగల్ శాఖ ఆధ్వర్యంలో నిధులు సమకూర్చి నిర్మాణాన్ని చేపడతామని స్థానిక ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. అగర్వాల్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో సభ్యులందరికీ ఉచిత కంటి పరీక్షలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎం. సుజిత్, సెక్రటరీ ఎస్. వినీల్ రావు, ట్రెజరర్ జీ. నికిత, సికాస చైర్మన్ బి. భగవాన్, ఎంసీ మెంబర్ హెచ్. భారత్, ఎక్స్ చైర్మన్ ఆర్. హరికృష్ణ, సభ్యులు బజాజ్, వెంకటేష్, గంగాధర్, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయండి

### జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్



పుట్టపర్తి, **కదిలించే వార్త/ జులై 01:** జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి పెండింగులో ఉన్న భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఎన్ హెచ్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎన్.హెచ్ 342 , ఎన్ హెచ్ 716 జి , ఏన్. హెచ్. 544 జి జాతీయ రహదారులు, వివిధ భూ సేకరణ సంబంధించిన పనుల పురోగతిపై సంబంధిత శాఖాధికారులతో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తో కలసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా రహదారులను విస్తృత పరిచి.. రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోంద న్నారు. అందులో భాగంగా.. జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారుల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఫారెస్ట్, పర్యావరణ, కోర్టు సంబందిత అంశాలు, అభ్యంతరాలు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలోని.. ఆయా ఆర్డీవోలు భూసేకరణ పెండింగ్ పనులను పునః పరిశీలించి వచ్చే సమావేశంలో సాధ్యాసాధ్యాల నివేదికలను సమర్పించాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి జిల్లా పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 342: ప్యాకేజీ బుక్కపట్నం మండలం బుచ్చైగారిపల్లి భూ సేకరణకు సంబంధించిన పనులపై సమీక్షించారు. ముదిగుబ్బ మండలం దొరిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల గోడ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్యాకేజీ 2:పుట్టపర్తి మండలం అమగొండ పాళం గ్రామం ప్రజల సంబంధించిన పెండింగ్ బిల్లుల పై సమీక్షించారు. ఎలాంటి పెండింగ్లో లేకుండా సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉన్నచో భారత జాతీయ రహదారుల అథారిటీ వారు సంబంధిత తహసీల్దార్ లతో మరియు రెవెన్యూ డివిజన్ అధికారులతో సమన్వయ సహకారం చేసుకుంటూ వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్ హెచ్ వెంకట సుబ్బయ్య, ఎన్ హెచ్ ఎ ఐ, పిడి బి అశోక్ కుమార్, మేనేజర్ ముత్యాల రావు, డీఈ గిడ్డయ్య, ఆర్ అండ్ బి డీఈ నాగరాజు, ఏ ఈ టి. కుల్లాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

### లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్





పుట్టపర్తి, **కదిలించే వార్త/ జులై 01:** సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ అన్నారు. మంగళవారం పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామంలో లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కొవ్వూరు వెంకటమ్మకు వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు విభిన్న ప్రతిభావంతురాలు నాగన్న గారి ఆదెమ్మకు రూ.6 వేలు, పోలియో వ్యాధిగ్రస్తురాలు బుక్కచెర్ల నల్లమ్మకు రూ.15 వేలు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ లబ్దిదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని, అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నామని, ప్రభుత్వ పథకాల లబ్దిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు ఎంపిపి గాయత్రి దేవి, ఎంపిడివో నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో జులై 21 నుండి సెప్టెంబర్ 30 వరకు బ్యాంకింగ్ సేవలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహణ: ఎల్ డి ఎం నరేష్ రెడ్డి



అనంతపురం,**కదిలించే వార్త/ జులై 01:** రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో జులై 21 నుండి సెప్టెంబర్ 30 వరకు బ్యాంకింగ్ సేవలపై ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ కార్యాలయం, అనంతపురం లీడ్ బ్యాంకు మేనేజర్ జి. నరేష్ రెడ్డి పేర్కొన్నారు.. ప్రతి గ్రామానికి ఒక బ్యాంకు బాధ్యత వహిస్తుందని, ఖాతాలు లేని వారికి తెరిపించడం, ఖాతాలో ఉన్నా వినియోగంలో లేకపోతే వారికి ఈ కేవైసీ చేయించడం తదితర సేవలు అందిస్తారని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, రూపే కార్డు యాక్టివేషన్ గురించి అవగాహన కార్యక్రమాలను మంగళవారం జూలై 1న ఏ.నారాయణపురం మన్నిల గ్రామంలో నిర్వహించడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నీల గ్రామ సర్పంచ్ త్రిలోక్, ఎల్ డి ఎం నరేష్ రెడ్డి, యుబిఐ మేనేజర్ ఫరూక్, కెనరా బ్యాంక్ మేనేజర్ హేమంత్, రూడ్ సిటీ డైరెక్టర్ విజయలక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ భ్రమరాంబ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలి....

### సంక్షేమశాధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి .ఐఏఎస్



అనంతపురం,**కదిలించే వార్త/ జులై 01:** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సత్ఫలితాలతో నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి. ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లో ని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్సీ, ఎస్టీ, బి సి,మైనార్టీ, సైనిక సంక్షేమం ,మెప్మా శాఖ అధికారులతో ఆయా శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పనితీరుపై ప్రతి నెల వారిగా జరిగే సమావేశం ను నిర్వహించి అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్య సాధనలో భాగంగా 100% ప్రగతిని సాధించాలని అర్హులందరికీ ఆయా శాఖల ద్వారా లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మెప్మా ద్వారా స్వయం సహాయక సభ్యులకు ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్తగా ఎదిగే విధంగా తోడ్పాటు అందించాలన్నారు. మెప్మా పనితీరు లక్ష్యాలను ఇంకాబాగామెరుగుపరుచుకోవాలని తెలిపారు. శిల్పారామం లో ప్రజలు ఎక్కువగా సందర్శిస్తున్నందున ఖాళీగా ఉన్న స్టాళ్లల్లో మెప్మా స్వయం సహాయక బృందాలలోని మహిళలను ప్రోత్సహించే దిశగా యూనిట్లను ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్ నిర్వహణ దీనికి సంబంధించిన పర్యవేక్షణ తదితర అంశాలపై ఆ శాఖ అధికారుల ద్వారా కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ పక్కనే ఉన్న స్థలం సమస్య గురించి స్థానిక తహసిల్దార్ తో కలిసి వాస్తవ స్థితిగతులపై తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటించిన సమయంలో లబ్ధిదారులకు ఏవైనా ఆయా శాఖల ద్వారా ఆస్తుల పంపిణీ ఉన్నట్లయితే ఆరోజున జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ , బిసి, మైనార్టీ హాస్టల్లో ఆయా శాఖ అధికారులు కచ్చితంగా తనిఖీ చేసి వాటి స్థితిగతులపై నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ ద్వారా 35 మంది దాకా మాజీ సైనికులు భూమి కోసం దరఖాస్తు చేసుకోగా ఈ విషయంపై తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. గుంతకల్లు జరిగిన పిజి ఆర్ఎస్ కార్యక్రమంలో మాజీ సైనిక కుటుంబం గత 15 సంవత్సర కాలంగా చుక్కల భూమి సమస్య పరిష్కరించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. మాజీ సైనికులకు సంబంధించిన సమస్యలను ఈ ఫైలింగ్ ద్వారా తనకు సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వికలాంగులకు సంబంధించి ఆయా శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై నివేదించాలన్నారు. హిజ్రాలకు గుర్తింపు కార్డు మంజూరు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో తనకు హిజ్రాల ఆగడాలపై పలు ఫిర్యాదులు వచ్చాయని వాటిని అరికట్టే క్రమంలో జిల్లా ఎస్పీకి వికలాంగుల శాఖ అధికారి ద్వారా ప్రత్యేక లేఖను సమర్పించి ఆగడాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న షాపుల నెలసరి బాడుగ చెల్లింపు విషయమై నివేదిక సమర్పించాలని షాపుల బాడుగలను సక్రమంగా చెల్లించని వారిపై తొలగింపు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్కాలర్షిప్పులు, ప్రభుత్వ ఖాజీల రెన్యువల్స్, మసీదుఇమామ్ , మౌజనులు మరియు పాస్టర్ల వేతనాలు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. రానున్న సమావేశంలో పూర్తిస్థాయిలో లక్ష్యసాధన నివేదికలతో హాజరుకావాలని సంక్షేమ శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ప్రజలకు ఆయా శాఖల ద్వారా మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు, సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రామ సుబ్బారెడ్డి, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్రమణ్యం, వికలాంగుల శాఖ అధికారి అర్చన, మైనార్టీ కార్పొరేషన్ శాఖ అధికారి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నెల 1 న జిల్లాలో పేదల సేవలో స్వచ్ఛంద్ర,స్వర్ణంద్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు



అనంతపురం,**కదిలించే వార్త/ జులై 01:** మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, పి డి డ్వామా,జడ్పీ సి ఈ ఓ, డిపిఓ, గ్రామ,వార్డు సచివాలయ సమన్వయ అధికారి, డిఎల్డిఓ, ఈఓపిఆర్డీ, యంపిడిఓలతో స్వచ్ఛ భారత్ మిషన్, ఓడిఎఫ్ ప్లస్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్, సాస (%ూూూ%) యాప్, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, ఇంకుడు గుంతలు, స్వచ్చత పరిశుభ్రత, పారిశుధ్యం, అన్నా క్యాంటీన్లు ఇంటింటి నుండి చెత్త సేకరణ, పీఎం జన్మన్ పీఎం ఆదర్శ గ్రామ యోజన తదితర అంశాలపై జిల్లా అధికారులు, తహశీల్దార్లు,యం పి డి ఓ లు,మున్సిపల్ కమిషనర్లు నియోజవర్గాల, మండలాల ప్రత్యేక అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి, ఐ.ఎ.ఎస్.,నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెల 1వ తేదీ న పేదల సేవలో ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రతి నెల 3 వ శనివారం స్వర్ణంద్ర, స్వచ్చంద్ర కార్యక్రమం, ప్రతి నెల 30 న సివిల్ రైట్స్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక నెల మూడు కార్యక్రమాల ద్వారా సంవత్సరానికి 36 గ్రామాలను కవర్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి లో పి డి డ్వామా,డి ఆర్డీ ఏ,డి పి ఓ,జడ్పీ సి ఈ ఓ ఉంటారని. మండల స్థాయి లో నియోజకవర్గం, మండల ప్రత్యేక అధికారులు, యం పి డి ఓ,తహశీల్దార్,యం పి డి ఓ నోడల్ అధికారి గా ఉంటారు. గ్రామ స్థాయిలో పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉంటారు.పేదల సేవ లో కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, యం పి,ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన వచ్చును. పేదల సేవ లో కార్యక్రమంలో ముఖ్యమైనవి, డి ఆర్ డి ఏ, సివిల్ సప్లై,65 సంవత్సరాల నిండిన, త్రాగునీరు, ఉపాధి హామీ అంశాలకు సంబంధించి పేదల సేవలో 5 మందికి పింఛన్లు పంపిణీ ,రేషన్ పంపిణీ,త్రాగునీరు ప్రజలు వాడుకొని మంచి నీటి కుళాయిలు, ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఇంటికి సోకే ఫిట్స్, చేతి పంపులు ఉన్న చోట సోక్ ఫిట్స్ ఏర్పాటు చేయడం,మొక్కలు నాటడం, వంటి కార్యక్రమాలు,ఉద్యాన పంటలు పరిశీలించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతి నెల నియోజకవర్గంలో ని ఒక మండలం లోని ఒక గ్రామానికి వెళ్లడం జరుగుతుందని,ఎంపీ డి ఓ మండలంలో గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామానికి సంబంధించి సమస్యలు,ఏమి అవసరమైనవి చెక్ లిస్ట్ తయ్యారు చేయాలన్నారు. కలెక్టర్ తో పాటు నియోజకవర్గం, మండల ప్రత్యేక అధికారులు, డ్వామా పి డి,గృహ నిర్మాణ సంస్థ ఏ ఈ,గ్రామీణ నీటి సరఫరా ఏ ఈ,విద్యుత్ శాఖ,ఏ ఈ, తహశీల్దార్, యం పి డి ఓ ,పంచాయతీ సెక్రటరీ,ఉండాలన్నారు.

## రూ.200 ఉన్న పింఛన్ ని 4 వేల వరకు చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబే

### బుక్కచర్ల గ్రామంలో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత

### పింఛన్ దారుని ఇంట్లో టీ చేసి అందరికీ అందించిన ఎమ్మెల్యే సునీత



రాప్తాడు నియోజకవర్గం,**కదిలించే వార్త/ జులై 01:** గత ప్రభుత్వానికి.. ఈ ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన తేడాను ప్రజలు గమనించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. రాప్తాడు మండలం బుక్కచర్ల గ్రామంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేస్తూ.. ప్రతి నెల సచివాలయ సిబ్బంది ఇంటికి వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. 15వేల పింఛన్ అందుకున్న నల్లప్ప ఇంటికి వెళ్లి ఆయన్న పరామర్శించి.. పింఛన్ అందజేశారు. ఆ తర్వాత అతని ఇంట్లోనే ఎమ్మెల్యే సునీత స్వయంగా టీ చేసి.. అందరికీ అందజేశారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు రాధాకృష్ణ పాఠశాల కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కొన్ని సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చెరువులో విద్యుత్ లైన్ ఉందని చెప్పగా.. అది మార్చడానికి అనుమతులు, అంచనాలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రెండు వందలు ఉన్న పింఛన్ ను నాలుగు వేలు చేసిన ఘనత




ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గతంలో పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి 5వేలు మాత్రమే ఇచ్చే వారని.. దానిని 15వేలు చేశారన్నారు. ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే 46వేల 628మందికి ప్రతి నెల 21కోట్ల రూపాయలు పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే తల్లికి వందనం కింద 40కోట్ల రూపాయలు విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమ చేశారన్నారు. పిల్లలకు 5కోట్లరూపాయల విలువ చేసే విద్యా కానుక కిట్లు అందజేశామన్నారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. ఈనెలలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తారని.. వచ్చే నెలలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కూడా అమలవుతుందన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మనం ఏం చేశాం.. రానున్న రోజుల్లో ఏం చేయబోతున్నాము, ఇంకా ఎవరికైనా పథకాలు అందలేదా వంటి అన్ని అంశాలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జాకీ స్థానంలో రేమండ్ ను తీసుకొచ్చామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రిలో ఏ సమస్య ఉన్నా 8977769871కి కాల్ చేయండి

### 24%ఇ%7 రోగులకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

### ప్రజా సేవ సంబంధిత సమాచార వైద్యాధికారి ఫోన్ నెంబర్ల బ్రోచర్ల ఆవిష్కరణ




అనంతపురం అర్బన్, **కదిలించే వార్త/ జులై 01:** అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రతి నిత్యం వందలాది మంది రోగులు, వారి అటెండర్లు వస్తుంటారు. అయితే అక్కడ ఓపీ దగ్గర నుంచి అడ్మిషన్, డిశ్చార్జిల వరకు ఎక్కడికి వెళ్లాలి.. ఎవర్ని అడగాలి వంటి వాటి మీద అవగాహన లేక చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు అందించకపోవడం, అపరిశుభ్రత, డబ్బులు అడగటం వంటివి కూడా ఎదురవుతుంటాయి. అయితే ఇలా సమస్యలు వచ్చినప్పుడు ఎవర్ని సంప్రదించాలని తెలియదని.. అందుకే ప్రత్యేకంగా ప్రజా సేవ సంబంధిత సమాచార వైద్యాధికారిని సంప్రదించే విధంగా ప్రభుత్వ ఆసుపత్రి యాజమాన్యం ఒక కంప్లైంట్ సెల్ ను ఏర్పాటు చేసినట్టు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ప్రజా సేవ సంబంధిత సమాచార వైద్యాధికారి ఫోన్ నెంబర్ల బ్రోచర్లను ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, ఆసుపత్రి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ ఆత్మారామ్, ప్రొఫెసర్ శ్రీనివాస శౌరి, వైద్యులు సౌజన్య కుమార్, శివ కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారాం, సమాచార వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో ఏ సమస్య ఉన్నా 8977769871కి కాల్ చేయాలన్నారు. ఇది మీకున్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఏవైనా ఫిర్యాదులు ఉన్నా స్వీకరిస్తారని చెప్పారు. 24%ఇ%7 రోగులకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి వారికి ఎలాంటి ఇబ్బందులు కల్గించకుండా చేయాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వాసుపత్రి యాజమాన్యం దీనిని తీసుకొచ్చినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. దీనిపై ఆసుపత్రిలో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## ఇంజనీరింగ్ కార్మికులారా సమ్మె విరమించండి :




అనంతపురం, నగరపాలక సంస్థ, **కదిలించే వార్త/ జులై 01:** అనంతపురము నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అసోసియేషన్ పేరుతో స్థానిక అనంతపురము మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులతో మంగళవారం కమిషనర్ బాలస్వామి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి చర్చ జరిపారు రాష్ట్ర ప్రభుత్వం, సి.డి.ఎం.ఏ ఆదేశాల మేరకు వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటానికి సమ్మె విరమించెల చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు చెరవాణి ద్వారా తెలియచేసారు ఆదేవిధముగా ప్రస్తుతము ప్రబుత్వము వారు ఆర్థిక మంత్రిత్వ శాఖ, కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటు చేశారని వారు చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారని కార్మికులకు అధికారులు వివరించారు అయితే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధికారుల సూచనపై రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తాము ధర్నా కొనసాగిస్తున్నామని వారి



అనుమతి ఆదేశాలు లేకుండా సమ్మె విరమించలేమని వారు కమిషనర్ కి విన్నవించారు , దీనిపై కమిషనర్ బాలస్వామి స్పందిస్తూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు సమ్మెను వెంటనే విరమించాలని వారు ధర్నా విరమించకుంటే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాల్సి వస్తుందని వారికి స్పష్టం చేశారు కార్మిక సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపిన వారిలో సూపరిండెంట్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్ డి ఈ ఈ లు, అసిస్టెంట్ ఇంజనీర్ లు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గం నియోజకవర్గ

## వైసీపీ విస్తృత స్థాయి సమావేశం




కళ్యాణదుర్గం, **కదిలించే వార్త/ జులై 01:** కళ్యాణదుర్గంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆధ్వర్యంలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, తలారి రంగయ్య, ఇతర నేతలు.. వైసీపీ చేపట్టిన 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పోస్టర్లు ఆవిష్కరించిన నేతలు అనంత వెంకటరామిరెడ్డి కామెంట్స్ : హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక విస్మరించడం చంద్రబాబుకు అలవాటే. 2014లోనూ అనేక హామీలిచ్చి తర్వాత ఏవీ అమలు చేయలేదు. మహిళా సంఘాల రుణాలు రద్దు చేస్తామని మోసం చేశారు. 2024 ఎన్నికల్లో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా వైసీపీ పోరాటం చేస్తుంది. మండల స్థాయిలో కూడా 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని చేపట్టాలి. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించాలి. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక కళ్యాణదుర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. కూటమిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. ఎవరూ భయపడొద్దు తెలుగుదేశం పార్టీ నేతలతో సహా అన్యాయంగా కేసులు నమోదు చేస్తున్న పోలీసులపైనా పోరాటం చేస్తాం. % అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా లోకేష్ రాజ్యాంగాన్ని అమలు



చేస్తామంటే కుదరదు. కళ్యాణదుర్గం నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మద్యం వ్యాపారం ఎక్కువైంది. వందల కొద్దీ బెల్ట్ షాపులు వెలిశాయి. మనం సంక్షేమం అందించడం కోసం పోటీ పడితే.. ఈ రోజు అవినీతిలో కూటమి నేతలు పోటీ పడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి హంద్రీనీవా నీరు తెస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా మాటలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం తలారి రంగయ్య పాదయాత్ర చేస్తే అది ముగిసేలోగా ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ వస్తుందని అన్నారు. ఈ రోజుకు పాదయాత్ర ముగిసి రెండు వారాలు అవుతున్నా ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కాలేదు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది. వైసీపీ విజయమే లక్ష్యంగా పని చేయండి. % పార్టీలో పదువులు తీసుకున్న వాళ్లంతా చిత్తశుద్ధితో పని చేయాలి. అధికార పార్టీ నేతల అవినీతి, దౌర్జన్యాలపై అందరూ మాట్లాడాలి అన్నారు.

## ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధించుకున్న చరిత్రక విజయం నేపథ్యంలో



అనంతపురం అర్బన్, **కదిలించే వార్త/ జులై 01:** అనంతపురం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు పత్రికా విలేకరుల సమావేశంలో మాదిగ కుల సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధించుకున్న చరిత్రక విజయం నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ 31 వ వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 11 గంటల కు ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాన్ని ఒంగోలు ఈదముడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మొదలైగ్రామంలోలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యులు మరియు ప్రధాన కార్యదర్శి కృపాకర్ పేరు పోగు వెంకటేశ్వరరావు వివిధ మాదిగ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని ఉద్యమ కార్యకర్తలు నాయకులు అభిమానులు వివిధ మాదిగ కుల సంఘాలు విజయోత్సవ ర్యాలీ ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కే పి నారాయణస్వామి చిన్న పెద్దన్న పూజారి చెన్నకేశవు లౌకిక పార్టీ రమేష్ మల్లీ ఎస్సీ సెల్ బండారు అనిల్ నాగేష్ మారుతి తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు

పార్టీ ప్రతి ఒక్క అంశాన్ని నిశితంగా పరిశీలిస్తోందన్న ఎమ్మెల్యే

30రోజుల్లో కాదు 15రోజుల్లోనే పూర్తి చేసి నెంబర్ వన్ గా నిలుద్దాం


చేసిన మంచిని.. చేయబోయే అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్న దగ్గుపాటి




అనంతపురం అర్బన్, **కదిలించే వార్త/ జులై 01:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు-ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు అనంతపురం నియోజకవర్గ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. అర్బన్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. డివిజన్, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు, రాష్ట్ర, జిల్లా, నగర కమిటీలలోని నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ తొలి ఏడాదిలో మనం చేసిన అభివృద్ధి గురించి.. ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నగరంలో 292 బూత్ లు ఉన్నాయని ప్రతి బురీత్



ఇన్ ఛార్జ్ దీనికి బాధ్యత తీసుకొని ముందుకెళ్లాలన్నారు. ప్రతిరోజు 30ఇళ్లకు తగ్గకుండా వెళ్లి.. ప్రతి ఇంట్లో మూడు నుంచి ఐదు నిమిషాలు సమయం కేటాయించాలన్నారు. మనం ఇప్పటివరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించాలన్నారు. అలాగే గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం గురించి ఆ విధ్వంసం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నది తెలియజేయాలన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే కూడా తెలుసుకోవాలని సూచించారు. డివిజన్ ఇన్చార్జులు బూత్ ఇన్చార్జిలతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. అలాగే క్లస్టర్ ఇన్చార్జిలు కూడా ఇందులో పాల్గొనాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతిరోజు ఈ కార్యక్రమాలలో తాను కూడా పాల్గొంటానని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన స్పందనను అలాగే ఎక్కడెక్కడ మనం పర్యటించామన్నది.. పార్టీ ఇచ్చిన యాప్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. మొత్తం ఈ కార్యక్రమాన్ని పార్టీ నిశితంగా పరిశీలిస్తోందని దీనిని పార్టీ నాయకులు గమనించాలని సూచించారు. అలాగే పాత, కొత్త నాయకులందరూ కలిసి సమన్వయంతో కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా జగన్ చెబుతున్న అబద్ధాల గురించి కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ జీవిత కాలం అబద్దాలు చెబుతూనే ఉంటారని ఈ ఏడాది కాలంలోనే 9.50 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో తీసుకొచ్చారన్నారు. 8లక్షల 50 వేల ఉద్యోగాలు యువతకు ఇచ్చారన్నారు. మన జిల్లాలో 35వేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు.




రాప్తాడులో వైసిపి నాయకులు జాకీ పరిశ్రమను వెళ్లగొడితే అదే స్థానంలో రేమండ్ పరిశ్రమను తీసుకొచ్చారని దీని ద్వారా 5వేల మందికి ఉపాధి కూడా కల్పించాలన్నారు. గత ఐదేళ్లలో రౌడీ షీటర్, గంజాయి వంటి వాటితో క్రైమ్ రేట్ ఏ విధంగా ఉంది.. ఇప్పుడు వాటిని పూర్తిగా నియంత్రించి నేరాలను ఎలా తగ్గిస్తున్నారన్నది తెలియజేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీల సంక్షేమం కోసం 45 వేల కోట్లు కేటాయింపులు వంటి అంశాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి. ఐ. ఏ.ఎస్.,

ఉరవకొండ, **కదిలించే వార్త/ జులై 01:** ప్రతి ఒక్కరూ విరి విరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.ఐ. ఏ.ఎస్., పేర్కొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు ఉరవకొండ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ తిప్పే నాయక్, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మరియు ఉరవకొండ మండల ప్రత్యేక అధికారిణి ఖుష్బూ కటోరీ,తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవి ప్రసాద్ ల లో కలిసి మంగళవారం ఉదయం ఉరవకొండ



నియోజకవర్గం,ఉరవకొండ మండలం,వెలిగొండ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం మరియు వెలుగొండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెంచన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వెలుగొండ గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని, జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం వెలుగొండ గ్రామంలోని 2025 జులై నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోషా పెంచన్లు పంపిణీ కార్యక్రమం పాల్గొని, పి. గోవిందరాజులు, జి. సిద్ధప్ప, డి. బొజ్జనులకు డిజేబుల్ పెన్షన్లను, పి. వీణమ్మకు వితంతు పెన్షన్ ను, మరియు పి. సుంకమ్మ, జె. పార్వతమ్మలకు ఓల్డ్ ఏజ్ పెన్షన్లు జిల్లా కలెక్టర్ పంపిణీ పంపిణీ చేశారు. ఇంకా మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వము నుండి ఎలాంటి సహాయం అవసరం కావాలని



లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో త్రాగునీటికి చాలా ఇబ్బందిగా ఉందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే గ్రామంలో నీటి సమస్య రాకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏ ఈని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రేషన్ షాపు తనిఖీ చేసి ఉమాదేవి అనే మహిళకు రేషన్ బియ్యాన్ని కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం వెలుగొండ గ్రామ పంచాయతీ కి సంభందించి (బృందావనం) చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రం నందు రూ 56,271 తో అదనంగా మూడు చెత్త నింపుటకు తొట్లు నిర్మాణానికి భూమి పూజ చేసి, మొక్కలు నాటారు. ఈ గ్రామంలో లోఎక్కడ కూడా చెట్లు లేవని గ్రామంలోని ప్రజలు అందరు మొక్కలు నాటాలని,మొక్కలు ఎక్కువగా ఉంటే వర్షాలు కురుస్తుయాని,అప్పుడు భూగర్భ జలాలు పెరుగుతాయని,అందుకోసం అందరూ మొక్కలు నాటి వాటి పెరుగుదలకు బాధ్యత తీసుకోవాలని గ్రామస్థులకు జిల్లా కలెక్టర్ చూచించారు. అనంతరం ఉరవకొండ మండల కేంద్రం చేరుకొన తహశీల్దార్ కార్యాలయంలో ని రికార్డు రూమ్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు, నియోజకవర్గం,మండల ప్రత్యేక అధికారులు,తహశీల్దార్, ఎంపిడిఓ,డ్వామా పి డి,ఏ పి ఓ,గ్రామీణ నీటి సరఫరా ఏ ఈ, పంచాయతీ సెక్రటరీ, మండల స్థాయి అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గం మరియు మండల ప్రత్యేక అధికారులు, క్షేత్రస్థాయిలో పర్యటించి మండల స్థాయి అధికారుల తో సమావేశాలు నిర్వహించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు.వెలిగొండ గ్రామంలో త్రాగు నీటి సమస్య రాకుండా



చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా ఏ ఈని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికి సోక్ ఫిట్స్ (ఇంకుడు గుంతలు) పామ్ పాండ్స్ ఏర్పాటు చేయాలని,పెద్ద ఎత్తున మొక్కలునాటించాలని డ్వామా పి డి ని ఆదేశించారు. మండల కేంద్రంలో శానిటేషన్ ప్లాన్ కు సంబందించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని,స్వచ్ఛంద్ర కు సంబంధించి ప్రపోజల్స్ తయ్యారు చేయాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. అంతకుముందు వెలిగొండ గ్రామం నందు జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఈరోజు వెలుగొండ గ్రామంలో పేదలకు సేవ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని,ముందుగా ఈ గ్రామంలో పెంచన్లు పొందుతున్న 5 మంది లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి వారిని పరామర్శించి వారికి పింఛన్లు పంపిణీ చేసి వారికి సంక్రాంగా ప్రభుత్వము అందించే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలుసుకొని,ఆ కుటుంబాలకు ఇంకా ఏమైనా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలకు అర్హులు ఉంటే వాటికి సంబంధించి అధికారుల కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామస్థులతో కలసి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా,త్రాగు నీటి సౌకర్యాలకు సంబంధించి చర్చించడం జరిగిందని,ఈ గ్రామానికి ప్రభుత్వం ద్వారా వచ్చే పనులంటిని సకాలంలో చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఓ.సుజాత,పంచాయతీ సెక్రటరీ వంశీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు,గ్రామ సర్పంచ్ వీరాంజనేయులు, యం పి పి.నరసింహులు, టి డి పి మండల కన్వీనర్ విజయ భాస్కర్,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి

- రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

- 'అనంత'లో రక్తదాన శిబిరం, అనాథలకు దుప్పట్లు పంపిణీ

- భారీ ఎత్తున అన్ని, ప్రజాసంఘాల నాయకులు శు భాకాంక్షలు వెల్లువ

- వేలాది మంది అభిమానులు, బంధుమిత్రులతో కిక్కిరిసిన రమేష్ గౌడ్ స్వగృహం

- గజమాలలతో సత్కారం..

అనంతపురం, **కదిలించే వార్త/ జులై 01:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం జేఎన్టీయూ రోడ్ శారదనగర్‌లోని ఆయన స్వగృహం వద్ద ఆయన అభిమానులు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పెద్ద సంఖ్యలో యువత రక్తదానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రమేష్ గౌడ్ అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పార్టీలకు అతీతంగా రమేష్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బంధుమిత్ర శ్రేయోభిలాషి అభిమానులతో ఆయన స్వగృహం కిక్కిరిసిపోయింది. పలువురు నాయకులు ఆయనను గజమాలలతో సత్కరించారు. అదేవిధంగా పుష్పగుచ్చాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించారు. పలువురు ప్రముఖులు, పార్టీల నేతలు ఫోన్ల ద్వారా రమేష్ గౌడ్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. పెద్ద సంఖ్యలో హాజరైన వారికి రమేష్ గౌడ్ అభిమానులు భోజన వసతి కల్పించారు. అనంతరం రాంనగర్‌లోని అనాథ ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే గుంటూరు, తెనాలి, రేపల్లె, విజయనగరం తదితర పట్టణాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పుస్తకాలు, అన్నదానం, దుప్పట్లు పంపిణీ, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం పెద్దలు



ఆదినారాయణ గౌడ్, ఈడిగ సంఘం జిల్లా అధ్యక్షులు సురేంద్ర కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వీబీ భాస్కర్‌బాబు, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చంద్రాచర్ల హరి, ప్రధాన కార్యదర్శి విష్ణు, జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఐఎంఎం బాషా, జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు మూర్తి, ఎస్సీ జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దాసగానిపల్లి కుళ్లాయప్ప, వాల్మీకి సంఘం సాకే ఆదినారాయణ, బీసీ సంక్షేమ సంఘం పుట్టపర్తి జిల్లా అధ్యక్షులు నామాల శంకర్, వడ్డెర సంఘం నాయకులు సంపంగి గోవర్ధన్, హిందూపురం బీసీ నాయకులు కేఈ శ్రీకాంత్ గౌడ్, లబ్బే రాఘవ, వెంకటేశ్, అనిల్, బీసీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కేశవ, భరత్, తాడిపత్రి నాయకులు సుబ్రమణ్యం, వెంకటేశులు, కళ్యాణదుర్గం నాయకులు మధు, శంకర్, పామిడి జగదీష్‌గౌడ్, దుర్గా గౌడ్, కదిరి శ్యాంబాబు, వైసీపీ రిలాక్స్ నాగరాజు, సుకేష్, కిరణ్, అంకే తేజ, గణేష్, వెంకట్, అచ్యుత్, రేణుకా యల్లమ్మ సొసైటీ అధ్యక్షులు నాగేష్ గౌడ్, రామ్మోహన్ గౌడ్, వైసీపీ మైనార్టీ నాయకులు హిద్దూ, ఆసిఫ్, పెద్ద ఎత్తున యువకులు తదితరులు పాల్గొన్నారు.



### విజయవాడ ఎస్కేసీవీ చిల్డ్రన్ ట్రస్టులో..

మహాత్మ జ్యోతిబా పూల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలతో, పోరాట పటిమతో బీసీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడు.. బీసీ అనే పదాన్ని పేరులోనే క్యాప్షన్‌గా




చేసుకుని ప్రజల్లో నిరంతరం శ్రమిస్తున్న శ్రామికుడు.. కర్షకుడు.. పేదల పెన్నిధి బీసీ రమేష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా విజయవాడలోని ఎస్కేసీవీ చిల్డ్రన్ ట్రస్టులో అనాథ పిల్లల ద్వారా కేక్ కటింగ్ చేసి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమా మహేశ్వర, విజయవాడ అధ్యక్షులు చెప్పాడా చందు, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ రఘు యాదవ్, విశ్వబ్రాహ్మణ నాయకులు లక్కోజు శివ, బీసీ నాయకులు జన, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో..

ఏ7 కన్వెన్షన్ హాలులో వైసీపీ యువ నేత, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా



టాస్క్ ఫోర్స్ సభ్యులు రమేష్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా వైసీపీ నాయకులు మంగళవారం నగరంలోని ఏ7 కన్వెన్షన్ హాలులో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ముఖ్యనేతలు అనంత చంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం రమేష్ గౌడ్ కేక్ కట్ చేయగా, ఆయనకు స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్పోరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుంతకల్లు నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశం

గుంతకల్లు, **కదిలించే వార్త/ జులై 01:** గుంతకల్లులో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పోస్టర్లు ఆవిష్కరించిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్ తదితరులు 'చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' కార్యక్రమంపై అవగాహన కల్పించిన నాయకులు




### అనంత వెంకటరామిరెడ్డి కామెంట్స్ :

గుంతకల్లులో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుంది. రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలవడమే లక్ష్యంగా పని చేయాలి. అధికారంలోకి రాగానే పొలిటికల్ గవర్నెన్స్ ఉంటుంది. ఇది జగన్ మాట. %-% అధికారం కోసం కాదు.. ప్రజలకు మంచి చేయడం కోసం మన పార్టీని అధికారంలోకి తీసుకురావాలి. 2024 ఎన్నికల్లో మనకు 40 శాతం ఓట్లు వచ్చాయి. 11 సీట్లే వచ్చాయి. కానీ ఎక్కడా కుంగిపోలేదు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాం. రైతాంగం సమస్యలు, విద్యుత్ చార్జీల పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళనలు చేశాం. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు అలవాటు. కూటమి విజయం సాధించి ఏడాది పూర్తయిన



సందర్భంగా చంద్రబాబు మోసాలను వివరిస్తూ "వెన్నుపోటు దినం" కూడా చేశాం. చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారు. ఈ పథకాల విలువ అక్షరాలా రూ.81 వేల కోట్లు. ఏడాదిగా ఈ ప్రభుత్వం ప్రజలకు రూ.81 వేల కోట్లు బకాయి ఉంది. % వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేయడం వల్లే తల్లికి వందనం పథకాన్ని అమలుల్లోకి తెచ్చారు. అది కూడా పూర్తి స్థాయిలో అందించలేదు. హామీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. %-% చంద్రబాబుకు జగన్ ఫోబియా పట్టుకుంది. అందుకే జగన్‌ను, వైఎస్ఆర్‌సీపీని భూస్థాపితం చేస్తానంటున్నాడు. పడుకున్నా.. నిద్రలేచినా చంద్రబాబుకు జగనే గుర్తుకొస్తున్నాడు. జగన్నామస్మరణ చేయనిదే చంద్రబాబుకు పొద్దుగడవదు. కేసులుకు ఎవరూ భయపడొద్దు.. గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం గతంలో జగన్ మంత్రివర్గంలో పని చేశారు. కానీ నేడు వైసీపీ కార్యకర్తలను బెదిరిస్తున్నారు. జయరాంను కర్నూలులో కొడితే గుంతకల్లులో పడ్డారు. ఇక్కడ కొడితే ఆలూరు కాదు.. రాజకీయంగా ఎక్కడా స్థానం ఉండదు. కార్యకర్తలు ఎవరూ భయపడొద్దు. విభేదాలు ఉంటే పక్కన పెట్టండి. పోలీసుల బెదిరింపులకూ ఎవరూ భయపడొద్దు. చట్టం అందరికీ వర్తిస్తుంది. ప్రజాస్వామ్యపద్ధతిలో ఎంతవరకైనా వెళ్తాం. అధికార పార్టీ నేతలు పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని వెళు_న్నారు. భవిష్యత్‌లో పోలీసులపై కేసులు పెడతాం. మీరు చేసే అన్యాయాలపై కేసులు పెడతాం. మిమ్మల్ని కూడా కోర్టుకు లాగుతాం. పోలీసులు మీ విధులను సక్రమంగా నిర్వర్తించండి. ఎస్పీ, డీఐజీలు చెప్పినట్టు పోలీసులు నడు ుకోవాలి. అంతేగానీ ఎమ్మెల్యేలు చెప్పినట్లు కాదు.. రాష్ట్రంలో టీడీపీ ఎమ్మెల్యేలు మద్యం వ్యాపారాల్లో మునిగిపోతున్నారు. బెల్టు షాపులు విచ్చలవిడిగా పెట్టారు. చివరకు చిన్న పిల్లలను కూడా మద్యానికి బానిస చేస్తున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని ఒక్కో మండలంలో ఒక్కో షాడో ఎమ్మెల్యేను పెట్టుకుని అధికారం చలాయిస్తున్నారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు ప్రజలకు వివరించాలి. జగన్ పాలనకు, చంద్రబాబుకు మధ్య తేడాను తెలియజేయాలి. % జగన్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం అటకెక్కించింది. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేయాలి. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి అందరూ పని చేయాలి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా మనమంతా కలిసికట్టుగా ముందుకెళ్దాం అన్నారు.

# ఘనంగా డాక్టర్స్ డే

"వైద్య రంగం పవిత్ర మైనది "

డి యం ఎచ్ ఒ  డా ఈ బి దేవి



అనంతపురం, **కదిలించే వార్త/ జులై 01:** డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బందితో కలిసి డాక్టర్స్ డే నిర్వహించారు, ఈ సందర్భంగా కార్యాలయంలోని సిబ్బంది డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఈ బి దేవి కి, ఇతర వైద్య అధికారులకు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు అలాగే కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్రావు,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ నారాయణస్వామి ,డాక్టర్ నరేందర్ రెడ్డి, ఎస్ ఓ మహమ్మద్ రఫీ,డెమో త్యాగరాజు, గంగాధర్,ఎచ్ ఈ ఈ ఓ నాగరాజు, కిషోర్, పణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గుత్తిలో ఘనంగా డాక్టర్స్ దినోత్సవం..



గుత్తి, **కదిలించే వార్త/ జులై 01:** గుత్తి : లయన్స్ క్లబ్ ఆఫ్ గుత్తి మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ గుత్తి ఫోర్ట్ తోపాటు విడిజి - 1ఏంజెఎఫ్ లయన్ డాక్టర్ ఏం.విరుపాక్షరెడ్డి 316జె తో కలిసి మంగళవారం గుత్తి పట్టణంలోని స్థానిక గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు.. ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లను డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సిఎన్ ఎల్లప్ప మెడికల్ ఆఫీసర్ గుత్తి మరియు ఆసుపత్రిలో ఉన్న డాక్టర్స్ అందరికి సన్మానంతో పాటు కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు..అనంతరం ఐపీపీ అయినా లయన్ టి శ్రీనివాసులు లయన్స్ క్లబ్ ఆఫ్ గుత్తి , పుట్టినరోజు కావడంతో కేకు కట్ చేసి బర్త్డే విషెస్ తెలిపారు..ఈ కార్యక్రమంలో లయన్ మెంబెర్స్ లయన్ షైక్ మహబూబ్ భాష,లయన్ వై. హనుమేష్ రెడ్డి,లయన్ జి. చిన్న వెంకటస్వామి,లయన్ బి. సంజప్ప యాదవ్, లయన్ కందుల హేమలత, లయన్ మక్బుల్ భాష, లయన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## గూగూడులో డ్రోన్లతో నిఘా...
## ఎలాంటి ఘటనలకు తావు లేకుండా చర్యలు



గూగూడు, **కదిలించే వార్త/ జులై 01:** జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాలతో గూగూడులో డ్రోన్లతో నిఘా... ఎలాంటి ఘటనలకు తావు లేకుండా చర్యలు నార్పల మండలం గూగూడులో భక్తులకు అసౌకర్యం, ఇబ్బందులు కల్గకుండా ఉండేలా జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు డ్రోన్లు ఎగురవేసి కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి దేవాలయాల పరిసరాలలో భక్తుల తాకిడిని పర్యవేక్షించారు ట్రాఫిక్ మేనేజ్మెంట్, నేరాల నియంత్రణల కోసం డ్రోన్ ల ద్వారా ప్రత్యేక నిఘా వేశారు.

## సింహాచలం అప్పన్న స్వామికి అర్చకులతో ప్రత్యేక పూజలు
## జరిపించి దర్శించుకున్న
## మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి





అనంతపురం,**కదిలించే వార్త/ జులై 01:** విశాఖపట్నం లోని సింహాచలం లో వరాహ లక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి ముందుగా ఆలయ ప్రాంగణం చేరుకొని కింద మెట్టుకల నుంచి కాలినడకతో రాజగోపురం,ముఖ్య ద్వారం నుంచి వెళ్లి అర్చకులు వారితో ప్రత్యేక పూజలు జరిపించి అనంతరం వేద పండితులతో ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు , స్వీకరించడం జరిగినది ఆయనతో పాటు హెచ్ ఎస్ జి స్టేట్ లీగల్ కమీషనర్ దుంపల వెంకటప్పల నాయుడు ఉన్నారు

## అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించం.....శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



శింగనమల నియోజకవర్గం, **కదిలించే వార్త/ జులై 01:** శింగనమల నియోజకవర్గంలోని పెన్నా నది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలియజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నా నుంచి తాడపత్రి వాసులు అక్రమంగా ఇసుకను యంత్రాలు ద్వారా తవ్వుతున్నారని నిదనవాడ గ్రామ రైతులు ఎమ్మెల్యే కి తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్పందించి రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఇసుకను తరలిస్తున్న వాహనాలను, వ్యక్తులను అరెస్టు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పెన్నా పరివాహక ప్రాంతంలో ఉన్న తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, గ్రామాల రైతులు ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన వెంటనే అక్కడికి చేరుకొని వాహనాలను సీజ్ చేశారు. పెన్నా నది నుంచి ఎవరైనా ఇసుకను తరలిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామన్నారు. పెన్నా నది పరివాహక ప్రాంతంలో వేలాదిమంది రైతులు బోర్లు వేసుకొని పంటలను సాగు చేస్తున్నారు. అక్రమంగా ఇసుకను తగిలిస్తే ఆ రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడతారని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలియజేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రైతుల పక్షాననిలిచి అక్రమంగా ఇసుకను తరలించే వారిని కూటమి నాయకులు కార్యకర్తలు ఎక్కడికక్కడ అడ్డుకోవాలన్నారు.

## ఎమ్మార్వో కరుణాకర్ సేవలు ఆదర్శనీయం....

ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు వ్యాఖ్య




మడకశిర, **కదిలించే వార్త/ జులై 01:** మడకశిర మండల మేజిస్ట్రేటుగా సేవలందించి, ప్రజల మన్ననలు పొందుతూ కరుణాకర్ అందించిన సేవలు ఆదర్శనీయమని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. కరుణాకర్ పదవీవిరమణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తిలతో కలిసి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు కరుణాకర్ సేవలను ఉద్దేశించి ప్రసంగించారు. పేదవారి పక్షాన నిలబడి, వారికి సకాలంలో సేవలు అందించిన కరుణాకర్ ను మడకశిర మండల ప్రజలు ఎప్పటికీ మరచిపోరు. ఇప్పటి వరకు ప్రజాసేవ చేసి పదవీవిరమణ పొందిన కరుణాకర్ తమ జీవితాన్ని హాయిగా, ప్రశాంతంగా కొనసాగించాలన్నారు. ఆ భగవంతుడు కరుణాకర్ కు, తమ కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాన్ని ప్రసాదించాలని కాంక్షించారు. ప్రజలకు ఉత్తమ సేవలందించిన వారు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. మడకశిర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో కరుణాకర్ అందించిన సేవలు గొప్పవని కొనియాడారు. మిగిలిన ఉద్యోగులు కూడా కరుణాకర్ గారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని, పేదవారికి సేవలందించడంలో ముందు వరుసలో ఉండాలని కోరారు.

# నిన్ను 11సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాదా

జగన్ రెడ్డి పై ఎమ్మెల్యే

దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం

46, 4, 37వ డివిజన్లలో పింఛన్లు పంపిణీ

చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు,

ఇతర పార్టీ ముఖ్య నాయకులు

76ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి చంద్రబాబు

పడుతున్న కష్టం చూడాలన్న దగ్గుపాటి









అనంతపురం అర్బన్, **కదిలించే వార్త/ జులై 01:** వైసిపిని 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 76 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం కోసం కష్టపడుతుంటే ఆయన మాత్రం రీకాలింగ్ అంటూ విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. అనంతపురం నగరంలోని పలు కాలనీల్లో ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. 46, 4, 37వ డివిజన్లలో ఆయన ఇవాళ ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, టిడిపి నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి కాలనీల్లో ఘన స్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్తూ పింఛన్ దారుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక అర్బన్ నియోజకవర్గంలోని 22,600 పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 2లక్షల 80వేల మందికి 125 కోట్ల రూపాయల పింఛన్లు ఒకటవ తేదీన ఇంటి వద్దకు వచ్చి అందజేస్తున్నామన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైతే సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని గాడిలో పెడుతున్నారన్నారు. ఐదేళ్లలో ఒక్క ఇండస్ట్రీ తెచ్చావా, ఒక్క ఉద్యోగమైనా ఇచ్చావా అంటూ జగన్ ని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి ఐదు కీలక హామీలు నెరవేర్చారని గుర్తు చేశారు. పోలవరాన్ని నువ్వు పక్కన పెడితే ఏడాదిలోనే 14 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి.. మళ్లీ ఆ ప్రాజెక్టుకు ఊపిరి పోశారన్నారు. అమరావతితో మూడు ముక్కలాట ఆడితే ఈ సంవత్సర కాలంలోనే 40వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి రాజధానిని నిర్మిస్తున్నారన్నారు. 76ఏళ్ల వయసులో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్ గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టం పడుతుంటే జగన్ మాత్రం విషం చిమ్ముతున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పొగాకు వినియోగ వ్యతిరేక సంతకాల సేకరణ కార్యక్రమం

· పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ,చేయించిన

డి యం హెచ్ ఓ .డా ఈ బి దేవి






అనంతపురం అర్బన్, **కదిలించే వార్త/ జులై 01:** జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఈ. బి. దేవి పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు నిర్వహించారు. జులై 1 వ తేదీ నుండి జులై 21 వరకు పొగాకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన కల్పించబడునని ఈ సందర్భంగా తెలిపారు సిగరెట్టు మరియు ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల యొక్క వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని పొగాకు మరియు వాటి ఉత్పత్తులకు దూరంగా ఉంటూ క్యాన్సర్ వంటి భయానిక వ్యాధులు రాకుండా నివారించుకోవాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వారందరి చేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం అవుతోందని మరియు మనిషి యొక్క ఆయుష్ క్షీణిస్తోందని కావున పొగాకు ఏ రూపంలో వాడినా అది మానవాళి ఆరోగ్యాన్ని క్షీణింప చేస్తుందన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాలలో సిగరెట్ మరియు ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని తెలియజేశారు. అతిక్రమించిన వారిపై చట్టం ప్రకారం చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్.జి. నారాయణస్వామి మాట్లాడుతూ, పొగాకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థుల చేత 21 రోజులు ప్రచారం నిర్వహించి సంతకాలు సేకరించవలెను , మండల విద్యాధికారులు బాధ్యత వహించవలెను అని తెలియజేశారు ప్రపంచవ్యాప్తంగా ధూమపానం వినియోగంలో భారతదేశం రెండవ స్థానంలో ఉంది అలాగే దేశంలో సంభవించే అత్యవసర మరణాలలో ప్రతి వంద మందిలో పదిమంది బాధ్యులుగా ఉన్నారు అలాగే 15 నుంచి 24 సంవత్సరముల వయసు పిల్లలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు సిగరెట్ ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తులను వాడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇలా యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల దేశ భవిష్యత్తు అగమ్య గోచరం కానుంది. సిగరెట్ వాడడం వలన అందులో ఉన్న నాలుగు వేల రకాల రసాయనాలు మనిషి యొక్క అవయవాలపై ప్రభావం చూపించి క్యాన్సర్ కు ముఖ్యంగా నోరు, గొంతు, ఊపిరితిత్తులు , జీర్ణాశయ మరియు జననేంద్రియ అవయవ క్యాన్సర్ కు కారణమవుతున్నాయి.అలాగే బహిరంగ ధూమపానము చేసిన మరియు ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని 100 గజాల లోపు ఎవరైనా దుకాణాలలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది మరియు జరిమానారు:200 కూడా విధించడం జరుగుతుంది పొగాకు ఉత్పత్తులపై ఎటువంటి ప్రచారం నిర్వహించ రాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ ధూమపానం మరియు ప్యాసివ్ స్మోకింగ్ వలన వల్ల గర్భవతులైన మహిళలు ఆరోగ్యవంతమైన సంతానాన్ని పొందలేరని తెలియజేశారు, పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి రక్షించాలని అది అందరి బాధ్యత అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ యుగంధర్,పరిపాలన అధికారి గిరిజ మనోహర్ , మలేరియా అధికారి ఓబులు, డెమో సిబ్బంది త్యాగరాజు, గంగాధర్ , మరియు జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, ఎన్సీడీ సిబ్బంది జిల్లా ఫ్లో రోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు ప్రేమ్,కిషోర్, శశి,మౌనిక పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమా విడుదల ఎప్పుడు??

**రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన ఫీజు రీయింబర్స్మెంట్**

**డబ్బులు ఇంతవరకు విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం**

**రియంబర్స్మెంట్ పథక విద్యార్థులు కోర్సు పూర్తయిన**

**పెండింగ్లో ఉన్న సర్టిఫికెట్లు**

**విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చిన సర్టిఫికెట్ లేక**

**ఉద్యోగాలు వదిలేసుకుంటున్న విద్యార్థులు**

**రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 4200 కోట్ల రూపాయల**

**ఫీజులు బకాయిలు విడుదల చేయాలి**

**పీజీ విద్యార్థులకు శాపంగా మారిన**

**జీవో నెంబర్ 77 రద్దు చేయాలి**

**రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో**

**ఆందోళన కార్యక్రమాలకు పిలుపు**

**ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి**

**కుల్లాయి స్వామి**




అనంతపురం అర్బన్, **కదిలించే వార్త/ జులై 01:** అనంతపురం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు వసతి దీవెన బకాయిలు 4200 కోట్లు విడుదల చేయాలని పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నేరం రాజశేఖర్ రెడ్డి భవనం నందు పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4200 కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు, కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువగలం పాదయాత్రలో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపే విద్యార్థుల కష్టాలు తీరుస్తాము విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వసతి దీవెన బకాయిలు విడుదల చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంవత్సరం పరిపాలన బాగా జరిగిందని సంబరాలు చేసుకుంటున్నారు తప్ప విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోలేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం మొదటిలో విద్యార్థులకు కావాల్సింది 4200 కోట్ల రూపాయలు అయితే 600 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు బడ్జెట్ సమావేశాలలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలకు 2600 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ ప్రభుత్వం నాయకులు సంబరాలు జరుపుకున్నారు కానీ నేటికీ 2600 కోట్ల రూపాయల డబ్బులు విద్యార్థుల ఖాతాలలో జమ కాలేదని పేర్కొన్నారు. కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమైన తప్ప విద్యార్థుల ఖాతాలలో డబ్బులు జమ కాలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులు తమ కోర్స్ పూర్తిచేసుకుని ఫీజియంబర్స్మెంట్ అందక సర్టిఫికెట్లు కళాశాలలోని ఉండిపోవడం వలన విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినా కూడా వారు ఉద్యోగాలకు వెళ్లలేక వదులుకోవాల్సిన పరిస్థితి ఈ రాష్ట్రంలో వచ్చిందని తెలిపారు.. కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక ఉన్నత చదువులకు వెళ్లలేక కూలీనాలీ పనులు చేసుకోవాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు.. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు జీవో నెంబర్ 77 వల్ల ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న విద్యార్థుల ఆశలు ఆవిరవుతున్నాయని పేర్కొన్నారు గతంలో పీజీ చదివే ప్రతి విద్యార్థికి ఫీజు రియంబర్స్మెంట్ పథకం వర్తింపజేసేది కానీ జీవో నెంబర్ 77 తీసుకువచ్చి కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలో చదివే వారికి మాత్రమే ఫీజు రియంబర్స్మెంట్ వర్తింపజేయడం జరుగుతోంది దానివల్ల చాలామంది ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ 4600 కోట్లు విడుదల చేయాలని పిజి విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ జిల్లా సహాయ కార్యదర్శి సమీర్ నాయకులు బాబ్జాన్ మణి హుక్బల్ అభి మన్సూర్ ఆఫ్ న్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో సుపరిపాలన...ప్రజలకు స్వేచ్ఛ...

### శిక్షణ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు వ్యాఖ్య..




మడకశిర,**కదిలించే వార్త/ జులై 01:** 2024 ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో 95శాతం స్ట్రైక్ రేట్ తో, 164 స్థానాల్లో విజయ దుందుభి మోగించి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి పాలనతో ప్రజలకు సుపరిపాలన, స్వేచ్ఛ రెండూ లభిస్తున్నాయని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు గారు అభిప్రాయం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు శిక్షణ కార్యక్రమాన్ని మడకశిరలోని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు గారు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తిలతో కలిసి తమ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు వాక్కు స్వాతంత్ర్యం కోల్పోయారు. స్వేచ్ఛగా బ్రతికే హక్కును కోల్పోయారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు భయం గుప్పిట్లో బిక్కు బిక్కుమంటూ జీవనం కొనసాగించాల్సి వచ్చింది. అరాచక పాలనను నిలదీసిన వారిపై అక్రమ కేసులు, నిర్బంధాలు, కక్షసాధింపులు, వేధింపులు, హత్యలు, ఆస్తుల విధ్వంసం వంటి దుర్మార్గాలకు వైసీపీ పాలకులు పాల్పడ్డారు. రాష్ట్ర మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. రైతులు ఆత్మహత్యల బాట పట్టినా కనీసం నాటి పాలకులు పట్టించుకోలేదు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అల్లాడిపోయారు. ఇలాంటి క్లిష్టతరమైన పరిస్థితుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు నడుపుతోంది. వైసీపీ పాలకుల చేతిలో దోపిడీకి గురైన రాష్ట్ర ఖజానాను తిరిగి నింపేందుకు పెట్టుబడులను సాధించేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోంది. కేవలం 365రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో 95 దిగ్గజ కంపెనీలను తీసుకొచ్చి రూ.5.34లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. రాష్ట్ర యువతకు ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నెరవేర్చే దిశగా ఇప్పటి వరకు తెచ్చిన పెట్టుబడుల ద్వారా 4,73,000 ఉద్యోగాలను సాధించాం. వీటిలో మూడొంతులు రూ.3,19,217కోట్ల పెట్టుబడులు, 3,50,573 ఉద్యోగాలు రాయలసీమ ప్రాంతానికి, అక్కడి యువతకు కూటమి ప్రభుత్వం కేటాయించింది. అన్ని ప్రాంతాలకు అభివృద్ధి వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రమంతా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రచిస్తూ ముందుకు సాగుతోంది. నిలిచిపోయిన అమరావతి, పోలవరం పనులను పట్టాలెక్కించి త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రభుత్వం శరవేగంగా పనులు జరుపుతోంది. ఈ విధంగా కూటమి ప్రభుత్వం ఒక్క సంవత్సర కాలంలోనే సుపరిపాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, సంక్షేమాన్ని కూడా అందిస్తోంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ పాలకులు ప్రభుత్వం పై విషప్రచారం, కుట్రపూరిత కార్యక్రమాలతో ప్రజలను అయోమయానికి గురిచేయాలని ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి అరాచక శక్తుల పట్ల కూటమి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టడంతో పాటు, రాష్ట్రాన్ని కూడా అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబెట్టడంలో ప్రతి కార్యకర్త, నాయకుడు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారికి అవసరమైన సేవలు అందించాలి. వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివరించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ విధిగా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్లు, డైరెక్టర్లు, 5 మండలాల కన్వీనర్లు, జనరల్ సెక్రటరీలు, బూత్ కన్వీనర్లు, కో బూత్ కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, యూనిట్ కో కన్వీనర్లు, క్లస్టర్ కన్వీనర్లు, క్లస్టర్ కో కన్వీనర్లు, టీడీపీ జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీ మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, కుటుంబ సాధికార సారథులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt) APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur. ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell: 6303427710